www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | గురువారం, అక్టోబర్15, 2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:220 | పేజీలు: 8 | వెల: రూ.5/-

నాలుగేళ్ల ప్రేమ.. పెళ్లైన గంటలకే పెటాకులు!

నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. ఎన్నో అడ్డంకులను దాటి, కుటుంబ సభ్యులను కష్టపడి ఒప్పించి పెళ్లి పీటలెక్కారు. కానీ, వారి ఆనందం కొన్ని గంటలు కూడా నిలవలేదు. ఉదయం ఒక్కటైన ఆ జంట.. సాయంత్రానికే విడిపోయింది. రిసెప్షన్‌లో మద్యం మత్తులో వరుడు చేసిన వీరంగంతో వారి నాలుగేళ్ల ప్రేమకథ విషాదాంతమైంది. ఈ ఘటన తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలో చోటుచేసుకుంది.కన్యాకుమారి జిల్లా కుళచ్చల్ సమీపంలోని రీతాపురం గ్రామానికి చెందిన రూబెన్ (31) ఆర్మీ సైనికుడిగా పనిచేస్తున్నాడు. కేరళ సరిహద్దులోని పారసాల సమీప గ్రామానికి చెందిన 26 ఏళ్ల యువతితో గత నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. తిరువనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న ఆమెను పెళ్లి చేసుకునేందుకు రూబెన్ చాలా కష్టపడ్డాడు. మొదట యువతి కుటుంబం తీవ్రంగా వ్యతిరేకించినా, చివరికి ఇరువైపుల పెద్దలు అంగీకరించారు.



సర్ పై సుప్రీంకోర్టులో
ఒవైసీ పిటిషన్

- ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టుకు వెళ్లిన అసదుద్దీన్ ఒవైసీ
- నిబంధనలు పాటించకుండా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపణ
- ఈ ప్రక్రియపై స్టే విధించాలని కోర్టుకు విజ్ఞప్తి

మిగతా 2వ పేజీలో..

ప్రాంతాల మధ్య
భేదాలు చూపొద్దు

- నల్గొండకు నీళ్లు ఇవ్వొద్దంటూ సీఎంపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు: గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్
- డిండి ప్రాజెక్టుకు నీళ్లు కేటాయించవద్దని అధికారులు చెప్పారని గుత్తా ఆగ్రహం
- నల్గొండ జిల్లాలో 7 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోందని వెల్లడి





గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు
తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- ఆధునిక యుగంలో సమాఖ్యలదే కీలకపాత్ర
- తెలంగాణ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు

ఎలాన్ మస్క్‌తో పోటీ..

అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపడంలో మన దేశ యువత ఎలాన్ మస్క్‌తో పోటీ పడుతోందని సీఎం కొనియాడారు. దేశానికి 2047 చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతుంటారని, స్వాతంత్ర్య శత జయంతి ఉత్సవాల నాటికి భారత్ అగ్రస్థానంలో ఉండాలని నిర్దేశించారని గుర్తుచేశారు. జనాభా శాతాన్ని మించి తెలంగాణ రాష్ట్రం జీడీపీకి తన వంతు వాటా అందిస్తోందని తెలిపారు. అందుకే 2025లో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని చెప్పారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతుందని, ప్రధాని మోదీ 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. అందుకు రాష్ట్రాల సహకారం అవసరమని మోదీ పేర్కొన్నారని సీఎం గుర్తు చేశారు.

హైదరాబాద్, అక్టోబరు 14 (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని ఆయన వారికి తెలిపారు. రాబోయే రోజుల్లో తయారీ రంగాన్ని భారీగా విస్తరించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం.. బుధవారం ఇక్కడఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌తో సమావేశమైంది. అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు బ్రిటన్ ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు.ఈ భాగస్వామ్యాన్ని ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, విద్యాసంస్థల మధ్య సహకారంగా మార్చేందుకు త్వరలో మరోసారి తెలంగాణలో పర్యటించాలని భావిస్తున్నట్లు సీఎంకు తెలిపారు. కాగా.. 'యూకే - ఇండియా సీఈటీఏ- రీజినల్ సినర్జీస్' పేరుతో యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం రేవంత్ ఈ సమావేశంలో ఆవిష్కరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరు కావాలని ఆహ్వానించారు.

మిగతా 2వ పేజీలో..

దసరాకు టీజీఎస్ఆర్టీసీ
భారీ ఏర్పాట్లు

- ఈ నెల 20 వరకు అందుబాటులో ప్రత్యేక సర్వీసులు
- ఆరు కీలక తేదీల్లో స్పెషల్ బస్సుల్లో 50 శాతం అధిక ఛార్జీల వసూలు
- మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం యథాతథం




మిగతా 2వ పేజీలో..

సినిమా చూస్తూ
డ్రైవింగ్..

ఆటో డ్రైవర్‌పై వీసీ సజ్జనార్ సీరియస్

- డ్రైవింగ్ చేస్తూ సినిమా చూస్తున్న ఆటో డ్రైవర్ వీడియోపై వీసీ సజ్జనార్ స్పందన
- ఇది క్షమించరాని నేరం, నడుస్తున్న మృత్యుశకటం అంటూ తీవ్ర ఆగ్రహం
- ప్రమాదకర డ్రైవింగ్ కింద భారీ జరిమానా, లైసెన్స్ రద్దు తప్పదని హెచ్చరిక



ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అభిజిత్ దీపేకు నిరసన సెగ

- దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావంటూ ఓ వ్యక్తి దీపేకును నిలదీత
- నవ్వుతూ థమ్సప్ చూపిస్తూ వెళ్లిపోయిన దీపేక




న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీపేకు ఢిల్లీలో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం ఆయన ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఒక వ్యక్తి ఆయనను అడ్డుకుని నిలదీశారు. "దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారు?" అంటూ ఆ వ్యక్తి గట్టిగా అరవడంతో ఎయిర్‌పోర్ట్‌లో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, దీపేక మాత్రం నవ్వుతూ, నిరసనకారుడికి థమ్సప్ చూపిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మిగతా 2వ పేజీలో..

కమలంలో ఎమ్మెల్సీ
కుస్తీ..

- తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై బీజేపీ ఫోకస్
- హైదరాబాద్ స్థానం నుంచి బలంగా వినిపిస్తున్న రాంచందర్‌రావు పేరు



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముమ్మరం చేసింది. ఈసారి టికెట్ల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా ఆశావహులు పోటీ పడుతుండటంతో, ఎంపిక ప్రక్రియ ఆసక్తికరంగా మారింది.పలువురు సీనియర్లు గట్టిగా లాబీయింగ్ చేస్తుండటంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది.

మిగతా 2వ పేజీలో..

సింగరేణిలో కుంభకోణాల
కుంభమేళ

- కమీషన్లు పంచుకునేందుకు సంస్థను కొల్లగొడుతున్నరు
- సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం 60 వేల కోట్లు బాకీ

- నష్టాల బాట పట్టించి ప్రైవేటీకరణకు కుట్ర
- నైనీ టెండర్లలో ఏమైందో చెప్పాలి
- రూ.10వేల కోట్ల స్కామ్‌పై విచారణ జరపాలి
- కార్మికుల హక్కుల కోసం మరో పోరాటం

మిగతా 2వ పేజీలో..

గోదావరిఖని, అక్టోబరు 14(సామాన్యుడి అస్త్రం)

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సింగరేణిలో అవినీతి పెరిగిపోయి, ఉత్పత్తి తగ్గిపోయిందని, ఇందుకు కార్మికులు బాధ్యులు కారని, కాంగ్రేస్సే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం స్థానిక జవహర్‌లాల్ స్టేడి యంలో జరిగిన సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సింగరే ణి 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ సర్కారులో 58మిలియన్ టన్నులకు బొగ్గు ఉత్పత్తి మాత్రమే ఎందుకు జరిగిందని ఆయన ప్రశ్నించారు. సైట్ విజిట్‌ల పేర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి అవినీతికర చర్యలతో ఓబీ టెండర్లు ఆలస్యమై సింగరేణి ఉత్పత్తికి విఘాతం కలిగిందని కేటీఆర్ అన్నారు. సిరుల సింగరేణిని అవినీతి గనిగా మార్చారని, కోల్‌మాల్ దొంగలు పెరిగిపోయారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు, నీళ్లు, బొగ్గుకు కొరత లేదని, ఇప్పుడు



ఆ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో కార్మిక లోకం ఆలోచించాలన్నారు. 40లక్షల టన్నుల బొగ్గును మాయం చేసిన ఈ దొంగలు గత మూడేళ్లుగా రూ.6,311కోట్లు సింగరేణి భవిష్యత్ కోసం పక్కన పెట్టామని, ఆ మొత్తాన్ని మాయం చేశారని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి జరుగడం లేదని, అందుకే విద్యుత్ కొరత ఏర్పడుతుందని సింగరేణి సంస్థను అబాసు పాలు చేసి అమ్మకానికి పెట్టాలని చూస్తున్నారని ఆయన అన్నారు.

రాహుల్‌కు వర్తక సంఘాల
అల్టిమేటం!

- ఆందోళనలపై పునరాలోచించాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి



న్యూఢిల్లీ(సామాన్యుడి అస్త్రం)

పండగల సీజన్‌లో రాజకీయ నిరసనల ప్రభావం వ్యాపారాలపై పడుతోందని దేశవ్యాప్తంగా పలు వర్తక, పారిశ్రామిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. 'ఓ టర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లకు వెళ్లే దారుల్లో ఆంక్షలు, రహదారుల దిగ్బంధం వల్ల వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నాయి.

హైజాక్ హెచ్చరిక

ఎయిరిండియాలో కనిపించని అనుమానాస్పద వస్తువులు

న్యూఢిల్లీ(సామాన్యుడి అస్త్రం)

ఫ్రాంక్‌ఫర్ట్-ఢిల్లీ ఎయిరిండియా విమానంలో హైజాక్ అలర్ట్ కలకలం రేపిన విషయం తెలిసిందే. దీంతో విమానాన్ని బుధవారం ఉదయం జైపుర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. భద్రతా సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



మిగతా 2వ పేజీలో..

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్

మొదటి పేజి తరువాయి

ఎలాన్ మస్క్‌తో పోటీ..

అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపడంలో మన దేశ యువత ఎలాన్ మస్క్‌తో పోటీ పడుతోందని సీఎం కొనియాడారు. దేశానికి 2047 చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ చెబుతుంటారని, స్వాతంత్ర్య శత జయంతి ఉత్సవాల నాటికి భారత్ అగ్రస్థానంలో ఉండాలని నిర్దేశించారని గుర్తుచేశారు. జనాభా శాతాన్ని మించి తెలంగాణ రాష్ట్రం జీడీపీకి తన వంతు వాటా అందిస్తోందని తెలిపారు. అందుకే 2025లో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసుకున్నామని చెప్పారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతుందని, ప్రధాని మోదీ 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. అందుకు రాష్ట్రాల సహకారం అవసరమని మోదీ పేర్కొన్నారని సీఎం గుర్తు చేశారు

400 ఏళ్లుగా హైదరాబాద్‌కు గుర్తింపు

అభివృద్ధిలో టోక్యో, సింగపూర్‌తో పోటీ పడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా సీఎం స్పష్టం చేశారు. 400 ఏళ్లుగా హైదరాబాద్‌లో కాస్మోపాలిటిన్ వాతావరణం ఉందని, అన్ని రాష్ట్రాలు, దేశాల వారిని ఆదరించే సంస్కృతి ఇక్కడ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అప్పుడు దేశ విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకు



చార్మినార్ ల్యాండ్ మార్క్‌గా ఉండేదని, ఆ తరువాత వ్యాపార లావాదేవీలకు ల్యాండ్ మార్క్ హైటెక్ సిటీ ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో హైదరాబాద్ అభివృద్ధిలో వేగం పెరిగిందని, క్యూర్ పరిధిలో ఉన్న పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రధాని మోదీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 'పెరీ' పరిధిలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ, రాష్ట్రాన్ని మూ డు భాగాలుగా విభజించి అభివృద్ధిని పట్టాలెక్కించామని, పెట్టుబడులకు పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

మూడు విభాగాలుగా విభజన..

రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం అన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని -కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని, ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని (ప్యూర్) పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేసుకుంటున్నామని, ఈ ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఇక మిగిలిన గ్రామీణ ప్రాంతాలను (రేర్)- రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా అభివృద్ధి చేస్తున్నామని ఇక్కడ వ్యవసాయం, ఫుడ్ ప్రా సెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి ప్రాధా న్యం ఇస్తామని చెప్పారు. దేశం ఆర్థికంగా బలపడాలంటే మహిళల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. అందుకు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు

మున్నూరు కాపుల సేవలు ఆదర్శం..

కాపు సామాజికవర్గం నుంచి ఎంతోమంది సినిమా, రాజకీయ రంగాలతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులుగా ఎదిగి ఆదర్శంగా నిలిచారని, నూతన పారిశ్రామిక విధానంలో మీరంతా భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. నక్సెస్ స్టోరీస్‌ను నిక్షిప్తం చేసి కొత్త తరానికి అందించాలన్నారు.

సింగరేణిలో కుంభకోణాల కుంభమేళ

మొదటి పేజి తరువాయి

తద్వారా ప్రభుత్వానికి రూ.30 వేల కోట్లు మిగిలాయన్నారు. వాటాలు కుదరక కుంభకోణాలను వారే బయట పెట్టుకుంటున్నారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ రూల్ పేరిట రూ.10 వేల కోట్ల స్కామ్ జరిగింది. సోలార్, జిలెటిన్ స్టిక్స్‌తోపాటు మరో నాలుగైదు కుంభకోణాలు జరిగాయి.ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి() లేఖ రాశాం. సింగరేణి కార్మికుల జీవితాలను ఆగం చేస్తున్నారని విచారణ కోరాం. సింగరేణిలో చోరీ జరిగింది.. నువ్వే పట్టుకోవాలని ఆయన ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అంటే దొంగకు చీకటి తోడైంది. ఒకరికొకరు కాపాడుకుని.. కమీషన్లు పంచుకునేందుకు సింగరేణిని కొల్లగొడుతున్నారు' అని కేటీఆర్ ఆరోపించారు. విద్యుత్ వ్యవస్థను రేవంత్ ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. థర్మల్ ప్లాంట్లకు సింగరేణి బొగ్గు ఎందుకు ఇవ్వడం లేదని, ఆ బొగ్గు అంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు.సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి() సరిగ్గా లేదంటే దానికి కారణం ప్రభుత్వమేనన్నారు. ఉద్యమంలో కేసీఆర్ కో అంటే కోల్‌బెల్ట్ మొత్తం కదలిందన్నారు. కేసీఆర్ హయాంలో సింగరేణి ఓ వెలుగు వెలిగిందని ఈ సంస్థ సాయంతోనే రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇవ్వగలిగామన్నారు. తెలంగాణకు రావాల్సిన 500 మెగావాట్ల పవర్ ప్రాజెక్టును గతంలో ఆంధ్ర ప్రాంతానికి తరలించారు. ప్రధాని మోదీ, చంద్రబాబు కలిసి తెలంగాణకు రావాల్సిన విద్యుత్ ప్రాజెక్టును ఆంధ్ర ప్రాంతానికి తరలించారుసింగరేణిని ప్రైవేటీకరించేందుకు రేవంత్



రెడ్డి కుట్రలు చేస్తున్నారని, సింగరేణి కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కరెంటు ఆగమైందని, మోసపోతే గొసపడతామని కేసీఆర్(ఖజ=) ఆనాడే చెప్పారన్నారు. సింగరేణిని అవినీతి గనిగా రేవంత్ మారుస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కరెంటు కొరత లేదని ఇప్పుడు రాష్ట్రంలో కరెంట్ కట్ సాధారణంగా మారిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అవినీతి రైజింగ్.. ప్రొడక్షన్ పాలింగ్ అన్న చందంగా పరిస్థితులు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. సింగరేణిపై తుపాకి పెట్టి.. రైతులకు నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సాగును నాశనం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిపై నిందలు వేస్తోందన్నారు. కరెంట్ కష్టాలకు బొగ్గు లేకపోవడమే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సింగరేణి బొగ్గు ఇవ్వడం లేదని బద్నాం చేస్తోందని ఆయన ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రభుత్వం సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ఆయన వెల్లడించారు.అందుకే సింగరేణిని ప్రైవేటు పరం చేయడానికే ప్రభుత్వం ఇలాంటి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.'పోరాటాల పురిటిగడ్డ రామగుండం. తెలంగాణ వచ్చిన రోజు రాష్ట్రం చుట్టూ చీకట్లే. అలాంటి నేపథ్యంలో సింగరేణి సాయంతో కేసీఆర్ 24 గంటల విద్యుత్ ఇచ్చారు. కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారు. కానీ.. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు ఇప్పుడు ఏడుస్తున్నారు. మోసపోతే గోస పడతామని కేసీఆర్ ఆనాడే చెప్పారు. కేసీఆర్ మాటలను ప్రజలు పెడచెవిన పెట్టారు.కరెంట్ కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది' అని కేటీఆర్ చెప్పారు. సింగరేణిలో రూ.10 వేల కోట్లకు పైగా కుంభకోణాలు జరిగాయని, వీటిపై సీబీఐ, విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 2023లో సింగరేణిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగగా, 2025- ఆర్థిక సంవత్సరంలో 58 మిలియన్ టన్నులకు తగ్గిందని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిదిపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. సింగరేణి సంస్థలో టెండర్ల ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టిన సైట్ విజిట్ విధానాన్ని అడ్డుపెట్టుకుని రూ.10 వేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని, ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది సుజన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. టెండర్లలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.సింగరేణిది 137 ఏండ్ల చరిత్ర. ఈ నాటిది కాదిది.

కమలంలో ఎమ్మెల్సీ కుస్తీ.. రాంచందర్‌రావుకే మొగ్గు?

మొదటి పేజి తరువాయి

ఈ రెండు స్థానాలకు సంబంధించి ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు బీజేపీ రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఈ కమిటీలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల నుంచి అభిప్రాయాలను స్వీకరించాయి. ఈ నివేదికలను బుధవారం రాష్ట్ర నాయకత్వానికి అందజేయనున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల స్థానానికి సుమారు 13 మంది, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి ఏడుగురు నేతలు పోటీలో ఉన్నారు. హైదరాబాద్ స్థానానికి రాంచందర్‌రావుతో పాటు పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్, డోకూరి పవన్‌కుమార్, గౌతమ్ రావు, శ్రీవర్ధన్ రెడ్డి వంటి నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అయితే, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తన అనుచరుడైన పవన్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం.మరోవైపు నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థానం కోసం పీఆర్‌టీయూ నేత భిక్షంగౌడ్, పుల్లారావు యాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కాసం



వెంకటేశ్వర్లు తదితరులు పోటీ పడుతున్నారురాష్ట్ర నాయకత్వం కమిటీల నివేదికలను పరిశీలించి, ప్రతి స్థానానికి ముగ్గురి పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపనుంది. దసరా పండుగ తర్వాత తుది అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ వ్యూహం ప్రకారం, ఒక స్థానాన్ని ఓపెన్ కేటగిరీకి, మరొకటి బీసీ వర్గానికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ఎన్నికలు జరగనున్నాయి.

ప్రాంతాల మధ్య భేదాలు చూపొద్దు

మొదటి పేజి తరువాయి

తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నల్గొండ జిల్లాకు సాగునీరు అందకుండా అడ్డుకునేందుకు కొందరు అధికారులు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నల్గొండలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈమేరకు ఆవేదన వ్యక్తం చేశారు.నీళ్లన్నీ పాలమూరుకే కేటాయించాలని, డిండి ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వొద్దని కొందరు వాదించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "డిండికి నీళ్లు కేటాయించవద్దని అనడం ఏంటి? నల్గొండకు నీళ్లు ఎలా ఇస్తారని సీఎంపై అధికారులు ఒత్తిడి తేవడం ఏంటి?" అని సూటిగా ప్రశ్నించారు. ఇటువంటి ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గకూడదని, ప్రాంతాల మధ్య వివక్ష చూపకుండా పాలకులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు.ప్రస్తుతం నల్గొండ జిల్లాలో కేవలం 7 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని గుత్తా గుర్తుచేశారు. మరోవైపు, పాలమూరు ప్రాంతంలో 25 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు ప్రారంభించినప్పటికీ, వాటికి నీటి వనరులపై స్పష్టత లేదని అన్నారు.

సినిమా చూస్తూ డ్రైవింగ్..

మొదటి పేజి తరువాయి

డ్రైవింగ్ చేస్తూ సినిమా చూడటం, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకోవడం వంటి నిర్లక్ష్యపూరిత చర్యలపై హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ తీవ్రంగా స్పందించారు. ఓ ఆటో డ్రైవర్ ఒకేసారి రెండు ఫోన్లు వాడుతూ, చెవులకు హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సినిమా చూస్తూ వాహనం నడుపుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ డ్రైవర్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఒక నెటిజన్ పంపిన ఈ వీడియోపై సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. "రెండు కళ్లకు ఎదురుగా రెండు ఫోన్లు, ఒక దాంట్లో నావిగేషన్, మరో దాంట్లో సినిమా, చెవులకు పెద్ద హెడ్‌ఫోన్లు. ఇది చూడటానికి గేమింగ్ విన్యాసంలా ఉన్నా, ప్రయాణికుల పాలిట నడుస్తున్న మృత్యుశకటం" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు.డ్రైవింగ్ సమయంలో క్షణకాలం దృష్టి మళ్లినా ఘోర ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు.

హైజాక్ హెచ్చరిక..



మొదటి పేజి తరువాయి

ఏఐ-2030 విమానం నుంచి హైజాక్ హెచ్చరిక అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)కు అందింది. వారు వెంటనే జైపుర్ ఏటీసీని అప్రమత్తం చేయడంతో విమానాన్ని ఉదయం 9:45 గంటల సమయంలో జైపుర్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో సుమారు 300 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. ముందుజాగ్రత్త చర్యగా ప్రయాణికులందరినీ కిందకు దించి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించారు.సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సహా ఇతర భద్రతా ఏజెన్సీల బృందాలు రంగంలోకి దిగి, సుమారు రెండున్నర గంటల పాటు విమానంలో విస్తృతంగా సోదాలు జరిపారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం, విమానం తిరిగి ఢిల్లీకి పయనమవ్వడానికి క్లియరెన్స్ ఇచ్చారు.అసలు హైజాక్ అలర్ట్ ఎలా జారీ అయిందనే దానిపై భద్రతా ఏజెన్సీలు విచారణ చేపట్టాయి. పైలట్ పొరపాటున అలర్ట్ బటన్ నొక్కారా? లేక సాంకేతిక లోపం వల్ల ఈ హెచ్చరిక వచ్చిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే విచారణలో పైలట్ తాను పొరపాటున బటన్ నొక్కలేదని చెప్పినట్లు తెలుస్తోంది. దీనిపై ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఈ ఘటన నేపథ్యంలో జైపుర్ విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. సాధారణంగా విమానం హైజాక్ అయినప్పుడు పైలట్లు 'కోడ్ 7500' ద్వారా ఏటీసీకి సంకేతాలు పంపుతారు. ఈ కోడ్ అందిన వెంటనే అధికారులు అత్యంత కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటారు.

రాహుల్‌కు వర్తక సంఘాల అల్టిమేటం!

మొదటి పేజి తరువాయి

చట్టబద్ధ వ్యాపారాలకు ఆటంకం కలగకుండా చూడాలని సీజేఐకి లేఖలు

సాధారణ వ్యాపారంలో 10-20 శాతమే జరుగుతోందని సంఘాల వెల్లడి

వ్యాపార సంస్థలు, కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జోక్యం చేసుకోవాలని కోరాయి.

పండగ సీజన్‌పైనే ప్రభావం!

ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, కేరళం రాష్ట్రాలకు చెందిన సంఘాలు అక్టోబర్ 12, 13 తేదీల్లో ఈ మేరకు లేఖలు రాశాయి. నవరాత్రులు, దసరా, దీపావళి, ఛత్ పూజ సమయంలో వ్యాపారాలు ఊపందుకుంటాయని గుర్తుచేశాయి. ఈ తరుణంలో నిరసనల వల్ల వినియోగదారుల రాక తగ్గితే చిన్న వ్యాపారులు, ఉద్యోగులు, రోజువారీ కూలీల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

రాజకీయాలకు వ్యాపారులు బలికావాలా?

'భారతీయ ఉద్యోగ్ వ్యాపార్ మండల్' ఢిల్లీ విభాగం, ఉత్తర్‌ప్రదేశ్ ఉద్యోగ్ వ్యాపార్ మండల్, 'ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా' తదితర సంఘాలు రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేశాయి. రాజకీయ విభేదాలకు వ్యాపారులు ఆర్థిక మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి రాకూడని స్పష్టం చేశాయి. పండగల సమయంలో వీధి నిరసనలను విరమించి, చర్చలు, చట్టపరమైన మార్గాల ద్వారా తమ అభ్యంతరాలను వ్యక్తం చేయాలని సూచించాయి.

సర్ పై సుప్రీంకోర్టులో ఒవైసీ పిటిషన్

మొదటి పేజి తరువాయి

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ꟻ×=) ప్రక్రియను ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి సరైన ప్రక్రియ పాటించకుండా పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆయన తన పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు.ఒవైసీ తరఫున న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించారు. ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి తమ పిటిషన్‌ను కూడా గురువారం విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. ఈ అభ్యర్థనను పరిశీలిస్తామని, సంబంధిత కేసులతో కలిపి విచారణ జాబితాలో చేర్చే అంశాన్ని చూస్తామని సీజేఐ తెలిపారు.

దసరాకు టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు..

మొదటి పేజి తరువాయి

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీదేవి వెల్లడించారు.పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని కొన్ని కీలక తేదీల్లో ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను 50 శాతం పెంచుతున్నట్లు టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. అక్టోబరు 9, 10, 16, 17 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, తిరుగు ప్రయాణంలో అక్టోబరు 25, 26 తేదీల్లో ఈ పెరిగిన ఛార్జీలు వర్తిస్తాయి. అయితే, సాధారణ రోజుల్లో నడిచే బస్సుల ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని అధికారులు స్పష్టం చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యం అన్ని బస్సుల్లో యథావిధిగా కొనసాగుతుంది.ఈ 7 వేల ప్రత్యేక బస్సుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్‌కు 3,533 బస్సులు కేటాయించారు. హైదరాబాద్ జోన్‌కు 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు 1,312 బస్సులు నడుస్తాయి. వీటితో పాటు నల్గొండకు 815, మహబూబ్‌నగర్‌కు 645, రంగారెడ్డి రీజియన్‌కు 440, మెదక్‌కు 255 బస్సులు ఏర్పాటు చేశారు.

స్లాబులకు రంధ్రాలు..

అదే కూల్చివేతా?



కూల్చిన భవనాలు



- **అమ్మేసి బిల్డర్ వెళ్లిపోతే.. కొనుగోలుదారుల భద్రత ఎవరిది?**
- **మియాపూర్, బీకే ఎన్‌క్లేవ్, అంజయ్యనగర్, సిద్దిక్ నగర్, ప్రేమ్ నగర్లో అనుమతుల్లేని నిర్మాణాలపై ఆరోపణలు**
- **స్లాబులకు రంధ్రాలతో సరిపెడుతున్న సిబ్బంది.. రెండు రోజులకే పునర్నిర్మాణం!**
- **కూల్చివేతల లెక్కలు ప్రకటిస్తున్న సీఎంసీ.. తదుపరి పర్యవేక్షణ వివరాలేవి?**

సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్ బ్యూరో :

ఒక కుటుంబం సొంతింటి కోసం ఏళ్ల తరబడి పొదుపు చేస్తుంది. అప్పు తీసుకుంటుంది. నెలనెలా వాయిదాలు కడుతూ పిల్లలతో నిశ్చింతగా ఉండాలనుకుంటుంది. ఆ కుటుంబం కొనుగోలు చేసిన ఫ్లాటు స్లాబును గతంలో అధికారులు ధ్వంసం చేశారని, బిల్డర్ తిరిగి నిర్మించి అమ్మాడని తర్వాత తెలిస్తే పరిస్థితి ఏమిటి. ఐదారు సంవత్సరాల తర్వాత అక్కడ ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి అండగా నిలిచేది ఎవరు. అనధికార నిర్మాణాలను అరికట్టాల్సిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేతల విషయంలో సంఖ్యలతోపాటు ఈ ప్రశ్నలకు కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.సీఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి ప్రాంతంలో అనధికార నిర్మాణాల నియంత్రణపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాదాపూర్, మియాపూర్, బీకే ఎన్‌క్లేవ్, అంజయ్యనగర్ సిద్దిక్ నగర్ హఫీజ్ పేట్, ప్రేమ్ నగర్ మసీద్ బండ, గాయత్రీ లేఔట్ వంటి ప్రాంతాల్లో అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలతోపాటు అసలు భవన నిర్మాణ అనుమతులే లేకుండా నిర్మిస్తున్న భవనాలు కూడా ఉన్నాయన్న సమాచారం అందుతోంది. అటువంటి నిర్మాణాల్లోనూ స్లాబులకు కొంతమేర రంధ్రాలు వేసి, అక్కడితో చర్యలు ముగిస్తున్నారు. అనధికార నిర్మాణాన్ని గుర్తించిన అధికారులు దాన్ని పూర్తిగా అరికట్టారా, లేక కొంత భాగాన్ని ధ్వంసం చేసి వెనుదిరిగారా అన్నది భవనాల వారీగా పరిశీలించాలి.

అధికారులు వెళ్లగానే మళ్లీ స్లాబు!

కొన్ని నిర్మాణాల్లో సుమారు ఆరు అడుగుల పొడవు, నాలుగు లేదా ఆరు అడుగుల వెడల్పుతో స్లాబులో భాగాన్ని ధ్వంసం చేసి, దాన్నే కూల్చివేతగా చూపిస్తున్నారు. అధికారులు వెళ్లిన రెండు రోజులకే బిల్డర్లు ఆ భాగాన్ని తిరిగి నిర్మిస్తున్నారని, అనంతరం ఫ్లాట్ల విక్రయాలు కూడా జరుగుతున్నాయి. ఈ అంశాలను కూల్చివేతకు ముందు, తర్వాత తీసిన చిత్రాలు, పునఃతనిఖీ రికార్డులతో నిర్ధారించాల్సి ఉంది.ఒక అనధికార అంతస్తులో స్లాబుకు రంధ్రం చేసినంత మాత్రాన ఆ అంతస్తు తొలగిపోయినట్లు కాదు. అనుమతి లేని భవనంలో కొంత భాగాన్ని ధ్వంసం చేయడంతో మిగిలిన నిర్మాణానికి అనుమతి వచ్చినట్లూ కాదు. గుర్తించిన ఉల్లంఘన ఎంత, తొలగించాల్సిన భాగం ఎంత, వాస్తవంగా తొలగించింది ఎంత, ఈ వివరాలు చెప్పకుండా కూల్చివేశాం అని ప్రకటిస్తే చర్యల అసలు ఫలితం ప్రజలకు ఎలా తెలుస్తుంది.



కూల్చిన చోట మళ్లీ నిర్మిస్తుంటే.. బాధ్యత ఎవరిది?

కూల్చివేత జరిగిన భవనం చిరునామా అధికారులకు తెలుసు. ఉల్లంఘన ఏమిటో తెలుసు. చర్య తీసుకున్న తేదీ కూడా రికార్డుల్లో ఉంటుంది. అలాంటి చోట తిరిగి నిర్మాణం జరుగుతోందా లేదా అని తనిఖీ చేయడం ఎందుకు జరగడం లేదు. అది జరుగుతుంటే ఆ నివేదికలు ఎక్కడున్నాయి.అనధికార భాగాన్ని తిరిగి నిర్మించినట్లు గుర్తిస్తే పనులు నిలిపివేయడానికి, వర్తించే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టడానికి అధికారులు ముందుకు రావాలి. ఇప్పటికే చర్య తీసుకున్న భవనాన్ని మళ్లీ పరిశీలించకుండా వదిలేస్తే, మొదటి కూల్చివేత ఉద్దేశమే దెబ్బతింటుంది. ఆచరణలో పర్యవేక్షణ లేని కూల్చివేత బిల్డర్‌కు తిరిగి నిర్మించుకునే అవకాశంగా కల్పించినట్టు అవుతుంది.

బిల్డర్ అమ్మి వెళ్లిపోతాడు.. కుటుంబం అక్కడే ఉంటుంది ఫ్లాట్ల విక్రయాలు పూర్తయ్యాక బిల్డర్ మరో ప్రాజెక్టుకు వెళ్లిపోవచ్చు. కానీ కొనుగోలుదారుల జీవితం అదే భవనంతో ముడిపడి ఉంటుంది. పిల్లలు అక్కడే పెరుగుతారు. వృద్ధులు అక్కడే నివసిస్తారు. ఇంటి రుణం మాత్రం ఏళ్ల తరబడి కొనసాగుతుంది. ఐదారు సంవత్సరాల తర్వాత నిర్మాణ సమస్య బయటపడితే మరమ్మతుల ఖర్చు, ప్రత్యామ్నాయ నివాసం, న్యాయపోరాటం వంటి భారాలను మొదట ఎదుర్కొనేది ఆ కుటుంబాలే. అప్పటికి బిల్డర్‌ను సంప్రదించడం కష్టమైతే పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది. అందుకే విక్రయానికి ముందే భవన అనుమతులు, గత కూల్చివేతలు, తిరిగి చేపట్టిన నిర్మాణం, భద్రతకు సంబంధించిన వివరాలు కొనుగోలుదారులకు తెలియాలి. అధికారులు ఒకసారి చర్య తీసుకున్న భవనంలో ఫ్లాట్లు విక్రయిస్తున్నప్పుడు, ఆ చర్యల సమాచారం ప్రజలకు అందుబాటులో ఉందా అన్నది కీలకం.అయితే అమ్మి వెళ్లిపోయినంత మాత్రాన బిల్డర్ చట్టపరమైన బాధ్యత ముగిసిపోదు. రెరా చట్టం వర్తించే ప్రాజెక్టుల్లో, స్వాధీనం అప్పగించిన తేదీ నుంచి ఐదేళ్లలో కొనుగోలుదారు తెలియజేసిన నిర్మాణ, పనితనం, నాణ్యత సంబంధిత లోపాలను ప్రమోటర్ అదనపు రుసుము లేకుండా 30 రోజుల్లో సరిచేయాలని సెక్షన్ 14(3) పేర్కొంటుంది. ప్రమాదం జరిగితే బాధ్యతంతా కొనుగోలుదారులదేనని చెప్పడం సరికాదు. ప్రమాదానికి కారణం, నిర్మాణ లోపాలు, పునర్నిర్మాణం, సంబంధిత వ్యక్తుల పాత్ర, అధికారుల విధి నిర్వహణ ఆధారంగా బాధ్యతను నిర్ధారించాలి.

భద్రతను నిర్ధారించకుండా వదిలేస్తారా?

ధ్వంసం చేసిన స్లాబును తిరిగి నిర్మించినప్పుడు దాని భద్రతను బయటకు కనిపించే రూపంతో నిర్ణయించలేం. ఏ భాగం దెబ్బతింది. తిరిగి నిర్మించిన విధానం ఏమిటి. మిగిలిన నిర్మాణంపై ప్రభావం ఉందా. అన్నది అర్హత కలిగిన నిర్మాణ నిపుణుల పరిశీలనతో తేలాలి.ప్రతి రంధ్రం వల్ల భవనం కూలిపోవడానికి అవకాశం ఉంది. అదే రంధ్రాన్ని పూడ్చినంత మాత్రాన నిర్మాణం సురక్షితమైందని భావించలేం. అందువల్ల చర్య తీసుకున్న తర్వాత భవనంలో మిగిలిన భాగాల స్థితి, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై స్పష్టత అవసరం. ప్రమాదం జరిగిన తర్వాత నివేదికలు వెతకడం కంటే, నివాసం ప్రారంభం కావడానికి ముందే పరిస్థితిని నిర్ధారించడం ప్రజలకు ఉపయోగపడుతుంది.

పూర్తిస్థాయి చర్యకు అడ్డంకి ఏమిటి?

అనధికార నిర్మాణాలపై చర్యలకు చట్టపరమైన వ్యవస్థ ఉంది. తెలంగాణ భవన అనుమతులు స్వీయ ధ్రువీకరణ చట్టం, 2020లోని సెక్షన్ 10 అనధికార నిర్మాణాల గుర్తింపు, పర్యవేక్షణ, చట్టవిరుద్ధంగా చేపట్టిన పనుల కూల్చివేత, ఖర్చును యజమాని నుంచి వసూలు చేయడం గురించి పేర్కొంటుంది. అయితే ప్రతి ఉల్లంఘనకు మొత్తం భవనాన్ని కూల్చివేయడం పరిష్కారం కాదు. అనధికార భాగం ఏదో నిర్ధారించి, వర్తించే ప్రక్రియ, కోర్టు ఆదేశాలు, సాంకేతిక భద్రతకు అనుగుణంగా చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు కూల్చివేతల మార్గదర్శకాలు కూడా అనధికారంగా, చట్టప్రకారం సర్దుబాటు చేయలేనిదిగా తేలిన నిర్మాణాన్నే తొలగించాలని స్పష్టం చేస్తున్నాయి.అందువల్ల ప్రశ్న మొత్తం భవనాన్ని ఎందుకు కూల్చలేదన్నది మాత్రమే కాదు. చట్టప్రకారం తొలగించాల్సిన అనధికార భాగాన్ని ఎందుకు పూర్తిగా తొలగించలేదు? తిరిగి నిర్మించకుండా ఎందుకు అడ్డుకోలేదు? అన్నదే. దశలవారీ చర్య అవసరమైతే ఆ వివరాలు చెప్పాలి. సాంకేతిక లేదా న్యాయపరమైన అడ్డంకులు ఉంటే వెల్లడించాలి. అసంపూర్తి చర్యను పూర్తయిన కూల్చివేతగా చూపించకూడదు.

గుర్తించినవి 15.. కూల్చినవి 16!

నిన్న విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో 15 అనధికార నిర్మాణాలను గుర్తించి, 16 నిర్మాణాలను కూల్చివేసినట్లు సీఎంసీ పేర్కొంది. శేరిలింగంపల్లిలో ఐదు, కూకట్‌పల్లిలో నాలుగు, కుత్బుల్లాపూర్‌లో ఏడు చొప్పున ఇచ్చిన సంఖ్యల మొత్తం కూడా 16గానే ఉంది. గుర్తించిన నిర్మాణాల కంటే కూల్చిన నిర్మాణాలు ఎక్కువగా ఎలా నమోదయ్యాయి? దీనిపై స్పష్టమైన వివరణ అవసరం.కూల్చివేతల వంటి కీలక చర్యల ప్రకటనలో సంఖ్యలకే స్పష్టత లేకపోతే, చర్యల పరిధిని ప్రజలు ఎలా అంచనా వేయగలరు? భవనాల చిరునామాలు, ఉల్లంఘనల వివరాలు, తొలగించిన భాగాలు వెల్లడిస్తే ఈ సందేహానికి సమాధానం దొరుకుతుంది. కేవలం జోన్ల వారీ సంఖ్యలతో సరిపెట్టడం పారదర్శకతకు చాలదు.

ప్రజల రక్షణే చర్యలకు కొలమానం

మాదాపూర్, మియాపూర్, బీకే ఎన్‌క్లేవ్, అంజయ్యనగర్ సిద్దిక్ నగర్, గచ్చిబౌలి, సూరారం, జీడిమెట్ల, దుండిగల్, చందానగర్, ప్రేమ్ నగర్, గాయత్రి లేఔట్ తోపాటు శేరిలింగంపల్లి పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్న సమాచారంపై సీఎంసీ సమగ్ర తనిఖీలు చేపట్టాలి. ఇప్పటికే కూల్చివేతలు చేసిన భవనాలను తిరిగి పరిశీలించి, పునర్నిర్మాణం జరిగిందా లేదా తేల్చాలి. కేసుల వారీగా ప్రస్తుత స్థితి, తదుపరి చర్యలు, పర్యవేక్షణకు బాధ్యత వహించే అధికారుల వివరాలు వెల్లడించాలి.ప్రజలను రక్షించాల్సిన వ్యవస్థ అనధికార నిర్మాణాన్ని గుర్తించిన తర్వాత కూడా అది పూర్తయి విక్రయాలకు వెళ్లే పరిస్థితిని అనుమతిస్తే, నియంత్రణ ఎక్కడ విఫలమైందో సమీక్షించాలి. తప్పు చేసిన నిర్మాణదారుడిపై చర్య పడాలి. చర్యల్లో నిర్లక్ష్యం నిర్ధారణైతే సంబంధిత అధికారుల బాధ్యతనూ తేల్చాలిసీఎంసీకి అది ఒక కూల్చివేత లెక్క కావచ్చు. కొనుగోలుదారుడికి అది జీవితకాల సంపాదనతో కొన్న ఇల్లు. ఆ ఇంట్లో ఉండే కుటుంబం భద్రతకు సమాధానం చెప్పే వరకు కూల్చివేతల సంఖ్యలతోనే పని పూర్తయినట్లు భావించలేం.

మందిలో పన్ను.. ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?

- **మాదాపూర్ 'ది జాయింట్ అల్ మంది'పై ఆరోపణలు.. అధికారుల స్పందనపై ప్రశ్నలు**
- **మటన్ మందిలో పుచ్చిపోయిన పన్ను కనిపించిందని ఫిర్యాదు**
- **వాంతులు, విరేచనాలు అవుతున్నాయని వినియోగదారుడి వీడియో ప్రకటన**
- **అధికారులు వచ్చేలోపే శుభ్రం చేశారన్న ఆరోపణ**

సామాన్యుడి అస్త్రం / మాదాపూర్



తనకు వాంతులు, విరేచనాలు అవుతున్నా అధికారులు స్పందించలేదని వినియోగదారుడు చెప్పడం ఆందోళన కలిగిస్తోంది. మాదాపూర్‌లోని 'ది జాయింట్ అల్ మంది' రెస్టారెంట్‌లో మటన్ మంది తింటుండగా పుచ్చిపోయిన మనిషి పన్నుగా అనుమానిస్తున్న వస్తువు కనిపించిందని ఆయన వీడియో ప్రకటనలో ఆరోపించారు.యాజమాన్యాన్ని ప్రశ్నించగా సరైన వివరణ ఇవ్వకుండా 'ఏం చేసుకుంటావో చేసుకో.. ఎక్కడైనా ఫిర్యాదు చేసుకో' అంటూ బెదిరించారని తెలిపారు. యజమాని చిరంతన్‌రెడ్డి, సిబ్బంది దురుసుగా వ్యవహరించారని, అధికారుల అండదండలు ఉన్నాయని చెబుతూ ఫోన్లు చేసి బెదిరించారన్నది ఆయన ఆరోపణ.ఆహార భద్రత అధికారులకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఫుడ్ సేఫ్టీ అధికారిణి నిహారిక మాట్లాడుకుని సెటిల్ చేసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. ఈ ఆరోపణపై స్పష్టత అవసరం.

ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యమా?

వినియోగదారుడి వీడియో ప్రకటన వివరాల ప్రకారం మధ్యాహ్నం సుమారు 1.30--2 గంటల మధ్య ఘటన జరిగింది. సుమారు 3.30--4 గంటల సమయంలో ఆయన ప్రకటన ఇచ్చే వరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు రెస్టారెంట్‌కు రాలేదని తెలిపారు. అప్పటికే తనకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయని చెప్పారు. ఈ లక్షణాలకు కారణం వైద్యపరంగా నిర్ధారించాల్సి ఉన్నా, ఆహార భద్రత ఫిర్యాదుపై స్పందన ఆలస్యమైందన్న ఆరోపణను అధికారులు పరిశీలించాలి.ఫిర్యాదు చేసిన విషయం తెలిసిన వెంటనే రెస్టారెంట్‌లోని సామగ్రిని శుభ్రం చేసి, అధికారులు వస్తే అంతా సక్రమంగా ఉన్నట్లు కనిపించేలా సర్దుబాటు చేశారని ఆయన ఆరోపించారు. ఈ వాదన నిజమైతే, ఫిర్యాదు సమయంలో ఉన్న పరిస్థితులను నమోదు చేయడంలో ఆలస్యం విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. శుభ్రం చేయడం ఒక్కటే తప్పుకు ఆధారం కాదు; ఫిర్యాదుకు సంబంధించిన పదార్థాలను తొలగించారా అన్నది తేల్చాలి.ఫిర్యాదు అందిన సమయం, అధికారులు స్పందించిన సమయం, తనిఖీకి చేరుకున్న సమయాన్ని వెల్లడించాలి. ఆహార నమూనాలు, అనుమానాస్పద వస్తువు, అందుబాటులో ఉన్న సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించాలి. బెదిరింపులు, సెటిల్‌మెంట్ సూచన ఆరోపణలపైనా సంబంధితవారి వివరణ తీసుకోవాలి.అనంతరం రెస్టారెంట్‌లో అధికారులు తనిఖీలు చేసినట్లు హెచ్‌ఎంటీవీ తెలిపింది. అదనపు కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు నిహారిక చెప్పారని 'సమయం తెలుగు' పేర్కొంది. అయితే వీడియో ప్రకటన ఇచ్చే సమయానికి స్పందన ఎందుకు ఆలస్యమైందన్న ప్రశ్నకు ఈ సమాచారం ఒక్కటే సమాధానం కాదు.



పండగకు ఊరెళ్తే..

ఇంటిపై ఓ కన్ను!

- **దసరా సెలవుల్లో ప్రయాణించే వారికి బొల్లారం పోలీసుల సూచనలు**
- **బంగారం, నగదు సురక్షితంగా భద్రపరచాలని విజ్ఞప్తి**
- **అనుమానాస్పద కదలికలుంటే డయల్ 112కు సమాచారం ఇవ్వాలి**


సామాన్యుడి అస్త్రం / ఐడీఏ బొల్లారం :



దసరా పండగకు సొంతూరికి వెళ్లి కుటుంబ సభ్యులతో గడపాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారా? ప్రయాణానికి సర్దుకునే హడావుడిలో ఇంటి భద్రతను మరిచిపోవద్దని ఐడీఏ బొల్లారం పోలీసులు సూచిస్తున్నారు. ఊర్లో పండగ ఆనందంగా జరుపుకోవాలంటే ఇక్కడ ఇంటికి తగిన రక్షణ ఉండాలని, బయలుదేరే ముందు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని స్టేషన్ ఎస్‌హెచ్ఓ వి.సుధీర్‌కుమార్ పేర్కొన్నారు.ఇంట్లో బంగారం, నగదు ఉంచకుండా సురక్షితంగా భద్రపరచుకోవాలని సూచించారు. తలుపులు, కిటికీలు సరిగా మూసి దృఢమైన తాళాలు వేయాలన్నారు. ఇంటి తాళాలను బయట దాచిపెట్టి వెళ్లవద్దని స్పష్టం చేశారు. బయలుదేరే ముందు నమ్మకమైన పొరుగువారికి, సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చి ఇంటిని గమనించాలని కోరాలన్నారు.సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని, రాత్రివేళ ఇంటి బయట వెలుతురు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కెమెరాలు ఉన్నాయనే భరోసాతో సరిపెట్టకుండా అవి సక్రమంగా పనిచేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.పండగ ప్రయాణం గురించి సోషల్ మీడియాలో పంచుకోవాలనే ఉత్సాహం ఉన్నా.. ప్రయాణ వివరాలను పోస్టు చేయవద్దని పోలీసులు సూచించారు. ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. బయలుదేరే ముందు తీసుకునే కొద్దిపాటి జాగ్రత్తలే ఇంటికి రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

దుండిగల్‌లో చైన్‌మన్‌దే పెత్తనమా?

- తిరుపతి పాత్రపై వసూళ్ల ఆరోపణలు.. బాధ్యతల అప్పగింతపై అధికారులకు ప్రశ్నలు
- నిర్మాణదారులు ముందుగా తననే కలవాలంటున్నారన్న ఆరోపణ
- ఇతర చైన్‌మన్లను బెదిరిస్తున్నారంటూ అందుతున్న సమాచారం
- గత ఏసీబీ తనిఖీల తర్వాత తీసుకున్న చర్యలపై స్పష్టత అవసరం



సామాన్యుడి అస్త్రం / దుండిగల్ :

ఇల్లు కట్టుకునే వ్యక్తికి అనుమతి కోసం ఎవరిని కలవాలో తెలియాలి. నిర్మాణంలో ఉల్లంఘన ఉంటే బాధ్యత కలిగిన అధికారి నోటీసు ఇవ్వాలి. అభ్యంతరం ఉంటే వివరణ చెప్పుకునే అవకాశం ఉండాలి. కానీ అధికారులను కలవడానికి ముందే ఒక చైన్‌మన్‌ను కలవాల్సిన పరిస్థితి ఉంటే.. సర్కిల్‌లో వ్యవస్థ పనిచేస్తున్నట్లా? వ్యక్తి పెత్తనం నడుస్తున్నట్లా? దుండిగల్ సర్కిల్‌లో అవుట్‌సోర్సింగ్ చైన్‌మన్ తిరుపతి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు ఈ ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి.నిర్మాణదారులు, స్థానికుల్లో తిరుపతి పాత్రపై చర్చ జరుగుతోందని అందిన సమాచారం చెబుతోంది. సర్కిల్‌లో ఆయనకు అప్పగించిన పనులేమిటి? వాటి పరిధి ఎంత? ఎవరి పర్యవేక్షణలో పనిచేస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత కోరుతున్నారు. ముఖ్యంగా అనధికార నిర్మాణాల వద్ద ఆయన జోక్యం, నిర్మాణదారులతో వ్యవహరిస్తున్న తీరు, పై అధికారులను కలిసే విషయంలో పెడుతున్నట్లు చెబుతున్న ఆంక్షలపై విచారణ అవసరమవుతోంది.

ముందుగా ఆయననే కలవాలా?

నిర్మాణ అనుమతులు, ఉల్లంఘనలపై చర్యలు తదితర అంశాల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులను కలవాలన్నా ముందుగా తన వద్దకు రావాలని తిరుపతి చెబుతున్నారన్నది ప్రధాన ఆరోపణ. సర్కిల్ పరిధిలో ఎక్కడ అక్రమ నిర్మాణం జరిగినా సమాచారం తొలుత తనకే ఇవ్వాలని ఇతర చైన్‌మన్లపై ఒత్తిడి తెస్తున్నారని, కొందరిని బెదిరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.ఈ సమాచారం నిజమైతే సిబ్బంది విధుల నిర్వహణలో స్వేచ్ఛ, అధికారుల పర్యవేక్షణ రెండింటిపైనా ప్రశ్నలు తలెత్తుతాయి. ఇతర సిబ్బందికి అప్పగించిన ప్రాంతాల్లోనూ ఒక వ్యక్తే జోక్యం చేసుకుంటున్నారా? ఆయన చెప్పిన తర్వాతే అధికారులు స్పందిస్తున్నారా? క్షేత్రస్థాయి నివేదికలు నేరుగా సంబంధిత అధికారికి చేరుతున్నాయా? ఇవన్నీ సర్కిల్ ఉన్నతాధికారులు పరిశీలించాలి.

లక్షల్లో వసూళ్లు.. వాటాల పంపకమా?

అనధికార నిర్మాణాల వద్ద లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, అందులో పై అధికారులకు వాటాలు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇవి తీవ్రమైన ఆరోపణలు. ఎవరి నుంచి, ఏ నిర్మాణానికి సంబంధించి, ఎంత మొత్తం అడిగారు? చెల్లింపులు జరిగాయా? వాటికి సందేశాలు, లావాదేవీలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా? అన్నది విచారణలో నిర్ధారించాలి.అక్రమ నిర్మాణాన్ని గుర్తించిన తర్వాత నోటీసు జారీ అయిందా? తదుపరి చర్య ఎందుకు నిలిచిపోయింది? ఒకే తరహా ఉల్లంఘనల్లో కొన్ని భవనాలపై చర్య తీసుకుని మరికొన్నింటిని వదిలేశారా? సంబంధిత ఫైళ్లు, తనిఖీ నివేదికలను పరిశీలిస్తే ఆరోపణల్లో వాస్తవమెంతో తేలే అవకాశం ఉంటుంది. వసూళ్ల ఆరోపణలను ఒక చైన్‌మన్ వ్యవహారంగా మాత్రమే చూడకుండా, ఆయనపై పర్యవేక్షణ ఉన్న అధికారుల పాత్రనూ పరిశీలించాలి.

సహాయక పనులా.. నిర్ణయాధికారమా?

తిరుపతికి కోర్టు కేసులకు సంబంధించిన పనులు, భవన అనుమతుల వ్యవహారాలు అప్పగించారన్న సమాచారం కూడా ఉంది. అయితే పత్రాలు అందించడం, రికార్డులు సేకరించడం వంటి సహాయక పనులు వేరు. అనుమతులు, నోటీసులు, చర్యలపై నిర్ణయాలు తీసుకోవడం వేరు. ఆయనకు వాస్తవంగా ఏ పనులు అప్పగించారో రాతపూర్వక ఆదేశాలతో వెల్లడించాలి.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అనే ఒక్క కారణంతో సహాయక పనులన్నింటినీ తప్పుపట్టలేం. కానీ అప్పగించిన పరిధిని దాటి నిర్మాణదారులను నియంత్రిస్తున్నారా, అధికారులను కలవడానికి అడ్డంకిగా మారుతున్నారా అన్నదే కీలకం. ప్రజలు కార్యాలయంలో తమ పని కోసం ఎవరినైనా వ్యక్తిగతంగా ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి ఉండకూడదు.

ఏసీబీ తనిఖీల తర్వాత ఏం మారింది?

దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో గతంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన విషయం అధికారిక ప్రకటనలో ఉంది. ఆ తనిఖీల అనంతరం కొందరు అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని చైన్‌మన్ విధుల నుంచి తప్పించారని, తిరుపతికి కొంతకాలం కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన పనులు అప్పగించి, తర్వాత మళ్లీ క్షేత్రస్థాయి బాధ్యతలు ఇచ్చారన్నది తాజాగా అందిన సమాచారం.ఈ మార్పులకు సంబంధించిన ఉత్తర్వులు ఏమిటి? అప్పట్లో విధులు మార్చడానికి కారణం ఏమిటి? తిరిగి బాధ్యతలు ఇవ్వడానికి ఏ అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు? అధికారులు వివరించాలి. గత ఏసీబీ తనిఖీలకు, ప్రస్తుతం తిరుపతిపై వస్తున్న ఆరోపణలకు సంబంధం ఉందా అన్నది కూడా అధికారికంగా తేలాల్సి ఉంది.

డీసీ వివరణ ఇవ్వాలి

ఇతర చైన్‌మన్లకు భిన్నంగా తిరుపతికి బాధ్యతలు అప్పగించారన్న సమాచారంపై సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పష్టత ఇవ్వాలి. సిబ్బంది పని విభజనకు అనుసరించిన ప్రమాణాలు, తిరుపతిపై పర్యవేక్షణ విధానం, ఆయన వ్యవహారశైలిపై ఫిర్యాదులు అందాయా లేదా అనే వివరాలు వెల్లడించాలి.ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలకు సమాధానం ఊహాగానాలతో రాదు. విధుల అప్పగింత ఉత్తర్వులు, పని రికార్డులు, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలే సమాధానం చెప్పాలి. తిరుపతి వివరణతోపాటు ఇతర సిబ్బంది, నిర్మాణదారుల నుంచి కూడా సమాచారం సేకరించి నిజానిజాలు తేల్చాలి.ఇల్లు నిర్మించుకునే వ్యక్తికి కావాల్సింది స్పష్టమైన నిబంధనలు, సమయానికి సమాధానం. అనధికార నిర్మాణం ఉంటే చట్టప్రకారం చర్య పడాలి. ఆ ఉల్లంఘనే ఎవరికైనా వసూళ్ల అవకాశంగా మారితే ప్రజలకు నష్టం, వ్యవస్థకు అపఖ్యాతి. దుండిగల్‌లో ఎవరి మాట నడుస్తోందన్న చర్చకు తెరదించాలంటే.. ఎవరి బాధ్యత ఏమిటో అధికారులు బయటపెట్టాలి. ఆరోపణలపై విచారణ జరిపి, తప్పు నిర్ధారణైతే సంబంధిత సిబ్బంది, అధికారులపై చర్య తీసుకోవాలి.

పేదలకు కేంద్రం మరింత భరోసా

సామాజిక భద్రతకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యం
రూ.53,428 కోట్లతో పీఎంఎస్ఎస్‌వైకి క్యాబినెట్ ఆమోదం
దివ్యాంగుల పెన్షన్ అర్హత 40 శాతానికి తగ్గింపు
హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 14 (సామాన్యుడి అస్త్రం)

దేశంలోని పేద కుటుంబాలకు సామాజిక భద్రత(కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి() అన్నారు. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్(ఎన్ఎస్ఏపీ) కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించి, 'ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజన'(పీఎంఎస్ఎస్‌వై)గా మార్చిందన్నారు. బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్‌లో ఈ పథకాన్ని 2026--27 నుంచి 2030--31 వరకు అంటే రానున్న ఐదేళ్లపాటు రూ53,428 కోట్ల వ్యయం తో కొనసాగించేందుకు ఆమోదం తెలపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ముఖ్యంగా దివ్యాంగుల పెన్షన్ అర్హతలను సడలించడం, సహాయ మొత్తాన్ని పెంచడం, మరింతమందిని పథకం పరిధిలోకి తీసుకురావడం.. సామాజిక భద్రతను విస్తరించే దిశగా మోదీ ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. దీంతో ప్రస్తుతం 3 కోట్లున్న వివిధ సామాజిక



పథకాల లబ్ధిదారుల సంఖ్య.. ఇప్పుడు 3.2 కోట్ల మంది లబ్ధిదారులకు పెరగనుందన్నారు.ఇది కాకుండా.. ఎన్ఎస్ఏపీ పేరును 'ప్రధానమంత్రి సామాజిక్ సహాయతా యోజన'గా.. జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకాన్ని 'ప్రధానమంత్రి విధవస్త పెన్షన్ యోజన'గా.. జాతీయ వితంతు పెన్షన్ పథకాన్ని 'ప్రధానమంత్రి విధవా పెన్షన్ యోజన'గా, జాతీయ దివ్యాంగుల పెన్షన్ పథకాన్ని.. 'ప్రధానమంత్రి దివ్యాంగ్‌జన్ పెన్షన్ యోజన'గా జాతీయ కుటుంబ సహాయ పథకాన్ని 'ప్రధానమంత్రి పరివార్ లాభ్ యోజన'గా కేంద్ర క్యాబినెట్ మార్పు చేసిందన్నారు.

పెన్షన్‌లలో భారీ సంస్కరణ

ఇప్పటివరకు కనీసం 80 శాతం వైకల్యం ఉన్నవారికి వర్తించిన పెన్షన్‌ను, ఇకపై 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి కూడా వర్తించేలా మార్పులు జరిగాయని కిషన్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగుల పెన్షన్ 25 శాతం పెంచడం శుభపరిణామమన్నారు. వైకల్యంతో పుట్టిన చిన్నా రి సంరక్షణ బాధ్యత మొదటి రోజు నుంచే కుటుంబంపై ఉంటుందని తెలిపారు. అందుకే పెన్షన్ కోసం 18 ఏళ్లు వచ్చే వరకు వేచి ఉండాల్సిన ని బంధనను తొలగించామని, పుట్టినప్పటి నుంచే సహాయం అందించేలా మార్పు చేశామని తెలిపారు.చిన్నారికి 18 ఏళ్లు వచ్చే వరకు ఈ సహా యాన్ని తల్లిదండ్రుల ద్వారా అందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా.. ప్రస్తుతం 8.33గా ఉన్న దివ్యాంగుల పెన్ష న్ లబ్ధిదారుల సంఖ్య 27.48 లక్షలకు పెరగనుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.290 కోట్ల వార్షిక వ్యయం అవుతుండగా.. ఇకపై ఇది రూ.1,268 కోట్లకు చేరుతుందన్నారు. అటు.. వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్, కుటుంబ సహా య పథకాల పేర్లు మారినప్పటికీ, వాటి అర్హతలు, కేంద్ర సహాయ మొత్తాలు, లబ్ధిదారుల పరిమితుల్లో మార్పు లేదు.కేంద్ర ప్రభుత్వం అందించే సహాయానికి అదనంగా.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ సొంత నిధులతో అందించే అదనపు పెన్షన్ సహాయం దీనికి వేరుగా ఉంటుందని పేర్కొన్నారు. రూ.53,428 కోట్లను వచ్చే ఐదేళ్లలో ఈ అంశాలపై ఖర్చుచేయనున్నా రని తెలిపారు. తెలంగాణలోనూ ప్రస్తుతం కేంద్రప్రభుత్వ సామాజిక భద్రత పథకాల లబ్ధిదారుల సంఖ్య 7.28 లక్షలు కాగా.. తాజా మార్పులతో ఇది మరింతగా పెరగనుందని చెప్పారు. మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా.. రూ.2,132 కోట్లను ఆయా పథకాల లబ్ధిదారుల అకౌంట్లలోకి నేరుగా బదిలీ చేసిందన్నారు.

వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వలక్ష్యం

బ్యాంకర్లకు సన్మానంలో మంత్రి సీతక్క
'సరస్ ఫెయిర్ 2026'లో బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, అక్టోబర్ 14(సామాన్యుడి అస్త్రం)

గ్రామీణ మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలు చేయిచాచి అడిగే స్థాయి నుంచి, పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాలప నమ్మకంతో పెద్దఎత్తున రుణాలిస్తున్న బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు సంపాదించే ప్రతి రూపాయి వారి శ్రమకు, కష్టానికి ప్రతిఫలమన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో 'సరస్ ఫెయిర్ బ్యాంకర్లను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలకు ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా రూ.75 వేల కోట్ల రుణాలు అందించామని వెల్లడించారు. గతంలో రూ.5 లక్షలుగా ఉన్న రుణ పరిమితిని రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. ఆ తర్వాత బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో పాటు సీతక్క.. మహిళలతో కలిసి ఆడిపాడారు. అంతకుముందు సీతక్క.. గాంధీభవన్‌లో జరిగిన బతుకమ్మ పండుగ ఉత్సవాల్లోనూ పాల్గొన్నారు. బతుకమ్మ ద్వారా గిన్నిస్ బుక్ రికార్డు సాధించామని మంత్రి పేర్కొన్నారు. సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీఓ అధికారులు సమర్థవంతంగా పని చేసి తమ శాఖకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. బుధవారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను జిల్లా సీఈవోలు, డిప్యూటీ సీఈవోల అసోసియేషన్ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ కరణ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ నర్సింహులు, ట్రెజరర్ నవీన్, వైస్ ప్రెసిడెంట్లు ప్రవీణ్, సబిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకయ్య తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం

- రానున్న యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉంది
- పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

రానున్న యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తు మ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ నేపథ్యంలో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా పశుగ్రాసంగా వినియోగించేలా చూడాలని సూచించారు. అ వసరమైతే ఖరీఫ్ పశుగ్రాసాన్ని కొనుగోలు చే యాలని అధికారులకు స్పష్టం చేశారు. పశుగ్రాసం అందుబాటులో ఉండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదు ర్కొనేందుకు అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు.



కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం..

అధికారులకు తీవ్ర హెచ్చరిక

పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదని అధికారులపై అసహనం
నిర్లక్ష్యం చేస్తే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్కో సీఎండీని సస్పెండ్ చేస్తానని హెచ్చరిక
రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై యూకే మేయర్ల బృందంతో సీఎం చర్చలు
ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ఆహ్వానం



హైదరాబాద్, అక్టోబర్ 14(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు.బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. “పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు” అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

యూకే మేయర్లతో సీఎం భేటీ

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు.ఈ సందర్భంగా “యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్” అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న “ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026”కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

కూరగాయలు కొంటుండగా కుప్పకూలిన వ్యక్తి.. గుండెపోటుతో మృతి



సూర్యాపేట జిల్లాలో విషాద ఘటన
కూరగాయలు కొంటుండగా కుప్పకూలిన వ్యక్తి
గుండెపోటుతో మృతి చెందినట్టు ప్రాథమిక నిర్ధారణ
సీపీఆర్ చేసి కాపాడేందుకు విఫలయత్నం చేసిన స్థానికులు
సీసీ కెమెరాల్లో రికార్డైన సంఘటన

హైదరాబాద్, అక్టోబర్ 14(సామాన్యుడి అస్త్రం)

సూర్యాపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కూరగాయలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి, అక్కడికక్కడే కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన సూర్యాపేట జిల్లా, చిలుకూరు మండలం, బేతవోలు గ్రామంలో జరిగింది.బేతవోలు గ్రామానికి చెందిన బెజవాడ శ్రీనివాస్ అనే వ్యక్తి కూరగాయల కోసం స్థానిక మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ ఓ బండి వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తుండగా, ఉన్నట్టుండి అస్వస్థతకు గురై బండి కింద పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, శ్రీనివాస్‌ను బయటకు తీసి ప్రథమ చికిత్స (సీపీఆర్) చేశారు. ప్రాణం కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నించారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం హుటాహుటిన సమీపంలోని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, శ్రీనివాస్‌ను పరీక్షించిన వైద్యులు, అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శ్రీనివాస్ గుండెపోటు కారణంగా మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాదకర సంఘటన మొత్తం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది.

కిడ్నీలో రాయికి చికిత్స..

ప్రాణాలు కోల్పోయిన ఎల్ఎల్‌బీ గోల్డ్ మెడలిస్ట్

సికింద్రాబాద్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో యువ న్యాయవాది ఐశ్వర్య మృతి
కిడ్నీలో రాయి చికిత్సలో వైద్య నిర్లక్ష్యం జరిగిందని కుటుంబం ఆరోపణ
ప్లేట్‌లెట్లు పడిపోయి బ్రెయిన్ హెమరేజ్‌తో మరణించారని ఆసుపత్రి వివరణ
ఆసుపత్రి ఎదుట న్యాయవాదులు, కుటుంబ సభ్యుల ఆందోళన
విచారణ జరపాలని ఆరోగ్య శాఖ మంత్రిని కోరిన న్యాయవాదులు

హైదరాబాద్, అక్టోబర్ 14(సామాన్యుడి అస్త్రం)

సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువ న్యాయవాది మృతి చెందారు. కిడ్నీలో రాయికి చికిత్స పొందుతూ 28 ఏళ్ల ఐశ్వర్య మంగళవారం కన్నుమూశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు, తోటి న్యాయవాదులు తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆందోళనకు దిగారు.ఎల్ఎల్‌బీలో గోల్డ్ మెడల్ సాధించిన ఐశ్వర్యకు ఇటీవలే వివాహమైంది. కడుపు నొప్పితో బాధపడుతుండటంతో ఆమెను అక్టోబరు 6న ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షలు చేసిన వైద్యులు కిడ్నీలో 2 మిల్లీమీటర్ల పరిమాణంలో రాయి ఉందని, దానికి సర్జరీ అవసరమని చెప్పారని కుటుంబం చెబుతోంది. వాస్తవానికి అంత చిన్న రాయి మందులతోనే కరిగిపోతుందని, కానీ ఆసుపత్రి యాజమాన్యం శస్త్రచికిత్స చేయాలని ఒత్తిడి చేసి, ప్రాథమికంగా రూ.3 లక్షలు కట్టించుకుందని ఆరోపించారు.చికిత్స సమయంలో ఐశ్వర్య రక్తపోటు ఒక్కసారిగా పడిపోవడంతో ఆమెను మెడికల్ ఐసీయూకి తరలించినట్లు వైద్యులు తెలిపారు. యాంటీబయాటిక్స్ ఇచ్చినా ఆమె పరిస్థితి మెరుగుపడలేదని, 80 శాతం బ్రెయిన్ డెడ్ అయిందని కుటుంబానికి సమాచారం ఇచ్చారు. అనంతరం ఆమె మరణించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వర్గాలు స్పందిస్తూ... కిడ్నీ నుంచి మూత్రనాళానికి వెళ్లే మార్గంలో పెద్ద రాయి అడ్డుపడటంతోనే శస్త్రచికిత్స చేశామని తెలిపాయి. ఆ తర్వాత ఇన్ఫెక్షన్ సోకి, ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోయి, మెదడులో రక్తస్రావం (బ్రెయిన్ హెమరేజ్) కావడంతో మరణం సంభవించిందని వివరించాయి.ఐశ్వర్య మరణంతో కుటుంబ సభ్యులు, తోటి న్యాయవాదులు ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బాధ్యులైన వైద్యులను వెంటనే అరెస్ట్ చేయాలని, ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు సీనియర్ న్యాయవాదులు తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

హైదరాబాద్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్.. రాష్ట్రాభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను చేస్తామన్న సీఎం
దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడి
కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలని వ్యాఖ్య

హైదరాబాద్, అక్టోబర్ 14(సామాన్యుడి అస్త్రం)

2047వ సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈరోజు ‘సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026’ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై తమ ప్రభుత్వ దార్శనికతను వివరించారు.ఈ భారీ లక్ష్య సాధనలో భాగంగా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి ‘వికసిత్ భారత్’ సాధించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రగతి ప్రణాళికలు ఉన్నాయని, ఈ లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్రాల సహకారం అవసరమని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని... అభివృద్ధి విషయంలో కాదని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ‘ అనే త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఐటీ, సేవల కోసం ‘కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ’ (జఖ=జు), ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య తయారీ రంగం కోసం ‘పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ’ (గ్రాఖ=జు), మిగిలిన ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ కోసం ‘రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ’ (=ూా=జు) జోన్లను అభివృద్ధి చేస్తామన్నారు.ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, దీన్ని 10 శాతానికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌కు ఉన్న 400 ఏళ్ల కాస్మోపాలిటన్ సంస్కృతిని గుర్తుచేస్తూ, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. యువత, మహిళలు పారిశ్రామిక రంగంలోకి ఎక్కువగా రావాలని పిలుపునిచ్చారు. సమఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల సదస్సు జరుగుతుండగా, ప్రారంభోత్సవంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రేమ, పెళ్లిల్ల విషయంలో యువతకు ఒవైసీ కీలక సూచనలు

అమ్మాయి నచ్చితే పెళ్లి చేసుకున్నాకే ‘ఐ లవ్ యూ’ చెప్పాలని సలహా
పెళ్లి తర్వాతే జీవితంలో స్థిరపడతారని, ముందు కాదని వ్యాఖ్య
పెళ్లికాని వాళ్లతోనే సమస్యలంటూ విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 14(సామాన్యుడి అస్త్రం)

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రేమ, పెళ్లి విషయంలో యువతకు ఆసక్తికరమైన సూచనలు చేశారు. ప్రేమ భావనలు వ్యక్తం చేసే కంటే ముందు పెళ్లికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. యువతకు ఎవరైనా అమ్మాయి నచ్చితే, ముందుగా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని, ఆ తర్వాతే ఆమెకు ‘ఐ లవ్ యూ’ చెప్పాలని సూచించారు. ఓ సభలో యువతను ఉద్దేశించి ఒవైసీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జీవితంలో పూర్తిగా స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటామని చెప్పే యువత తీరును ఆయన తప్పుబట్టారు. “సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకోవడం కాదు, పెళ్లి చేసుకుంటేనే జీవితంలో సెటిల్ అవుతారు” అని ఆయన స్పష్టం చేశారు. తన నెరిసిన గడ్డాన్ని చూపిస్తూ, “నా గడ్డం తెల్లబడింది, నేను ఇప్పటికీ పూర్తిగా సెటిల్ అవ్వలేదు. పెళ్లి చేసుకుంటే జీవితంలోని మిగతా అంశాలన్నీ అవే సర్దుకుంటాయి” అని సరదాగా వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు పూశాయి.పెళ్లి చేసుకోని వారు చుట్టుపక్కల వారికి సమస్యలు సృష్టిస్తారని, ఇంట్లో ఎవరూ లేనివారే అందరినీ ఇబ్బంది పెడతారని ఆయన వ్యాఖ్యానించారు. పెళ్లి చేసుకోవడం ద్వారా జీవితంలో స్థిరపడటం చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు.



కూటమి పాలనలో కొలువుల జాతర.. ఇచ్చిన మాటకు కట్టుబడ్డాం: ఎస్వీఎస్ఎన్ వర్మ



కూటమి ప్రభుత్వంలో కొలువుల జాతర నడుస్తోందన్న టీడీపీ నేత వర్మ

150 రోజుల్లోనే 16,347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ పూర్తి చేశామని వెల్లడి

గెస్ట్ లెక్చరర్లు, పోలీస్ ట్రైనీల పారితోషికాలు, స్టైపెండ్లు భారీగా పెంపు

24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా లోకేశ్ కృషి చేస్తున్నారని వ్యాఖ్య

గత వైసీపీ పాలనలో నిరుద్యోగుల భవిష్యత్తు నాశనమైందని విమర్శ

అమరావతి,అక్టోబర్14,(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొలువుల జాతర కొనసాగుతోందని, ఇచ్చిన మాటకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని టీడీపీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. సీబీఎన్ అంటే డీఎస్సీ అని, డీఎస్సీ అంటేనే సీబీఎన్ అని, మాట ఇస్తే నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ మార్క్ పాలన అని ఆయన స్పష్టం చేశారు.మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాష్ట్ర విద్యా వ్యవస్థ ప్రక్షాళన జరుగుతోందని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగులు నరకం చూశారని వర్మ తీవ్రంగా విమర్శించారు. ఒక్క జాబ్ క్యాలెండర్ గానీ, డీఎస్సీ గానీ ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలను అత్యంత పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా భర్తీ చేసి నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపిందని ఆయన పేర్కొన్నారు.గతంలో నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్ల సేవలను పునరుద్ధరించామని, 90 మంది ఎస్టీ యువతకు కొత్తగా ఉపాధ్యాయ ఉద్యోగాలు, 700 కోయ భారతి టీచర్ పోస్టులను విజయవంతంగా భర్తీ చేశామని వివరించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల పారితోషికాన్ని ఒక పీరియడ్‌కు రూ. 150 నుంచి రూ. 375కు పెంచామని, దీనివల్ల వారు నెలకు గరిష్టంగా రూ. 27,000 అందుకునే అవకాశం కలిగిందని వర్మ తెలిపారు. అలాగే, పోలీస్ కానిస్టేబుల్ ట్రైనీలకు నెలకు ఇచ్చే స్టైపెండ్‌ను రూ. 4,500 నుంచి రూ. 12,000కు పెంచి, 5,757 మంది యువతకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ యువత సంక్షేమానికే కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పునరుద్ఘాటించారు.యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు దానికి మించి 24 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారని వర్మ ప్రశంసించారు. గత 26 నెలల్లోనే పారిశ్రామిక అనుకూల విధానాలతో గూగుల్, గ్రీన్‌కో వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి సుమారు రూ. 29 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించారని గుర్తుచేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోనసీమ అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతానికి అనువైన పరిశ్రమలను నెలకొల్పుతున్నారని అన్నారు. యువత ఉపాధి కోసం లోకేశ్ విదేశీ పర్యటనలు చేస్తుంటే, ప్రతిపక్షాలు కనీస జ్ఞానం లేకుండా విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తూ విద్యను ప్రోత్సహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంచి 'నో అడ్మిషన్స్' బోర్డులు పెట్టే స్థాయికి తీసుకొచ్చామని వర్మ వివరించారు. ప్రజలు మరో 15 ఏళ్లు కూటమి పాలనే కోరుకుంటున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

జనసేనలో చేరిన ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత బైరా దిలీప్

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పవన్ కల్యాణ్

గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున సత్తెనపల్లి నుంచి పోటీ

పవన్‌కు తాను రచించిన 'లైఫ్ హ్యాక్స్' పుస్తకం బహూకరణ

అమరావతి,అక్టోబర్14,(సామాన్యుడి అస్త్రం)

ప్రజారాజ్యం పార్టీ మాజీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త, బైరా ఫౌండేషన్ అధినేత బైరా దిలీప్ చక్రవర్తి జనసేన పార్టీలో చేరారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. నరసరావుపేట ప్రాంతానికి చెందిన దిలీప్ చక్రవర్తి, గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు.మెగా కుటుంబంతో దిలీప్ చక్రవర్తికి సుదీర్ఘ కాలంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గతంలోనూ జనసేన పార్టీతో కలిసి పనిచేసిన ఆయన, తదనంతర కాలంలో వ్యాపార వ్యవహారాలపై దృష్టి సారించేందుకు రాజకీయాలకు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. తాజాగా మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకుని, ఆయన తిరిగి జనసేన గూటికి చేరారు.ఈ సందర్భంగా దిలీప్ చక్రవర్తి తాను రచించిన 'లైఫ్ హ్యాక్స్' పుస్తకాన్ని పవన్ కల్యాణ్‌కు బహూకరించారు. అనంతరం ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల.. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

తొలి దశ నవంబర్ 26న పోలింగ్

మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు

మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న

మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న



అమరావతి,అక్టోబర్14,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖాదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం..



విచారణకు హాజరు కావాలని రజత్ భార్గవకు ఈడీ ఆదేశం

వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు

మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు

అమరావతి,అక్టోబర్14,(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో విచారణ మరింత వేగవంతమైంది. ఈ కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రీమీూ) కింద నమోదైన కేసులో భాగంగా, హైదరాబాద్‌లోని తమ ప్రాంతీయ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రజత్ భార్గవ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో రూపొందించిన నూతన మద్యం విధానం, మద్యం బ్రాండ్ల ఆమోదం, కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారిందనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది.ఈ కేసులో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రజత్ భార్గవను పలుమార్లు విచారించి, ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. సిట్ విచారణలో భాగంగా, నాటి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే మద్యం విధానంలో అక్రమాలు జరిగాయని, బేస్ ధరల పెంపును తాను వ్యతిరేకించినా పట్టించుకోలేదని భార్గవ వాంగ్మూలం ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి.సిట్ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ, ఇప్పుడు ఆర్థిక లావాదేవీల మూలాలను శోధిస్తోంది. భార్గవను ప్రశ్నించడం ద్వారా ఈ కుంభకోణంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

ఏవీఎస్ రాజు మృతి పట్ల సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సంతాపం

నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవస్థాపకులు ఏవీఎస్ రాజు కన్నుమూత


పారిశ్రామికవేత్తగా, సమాజ సేవకుడిగా రాజు సేవలు చిరస్మరణీయం అన్న చంద్రబాబు

నిర్మాణ రంగంతో పాటు సాహిత్యంలోనూ రాజు తనదైన ముద్ర వేశారన్న లోకేశ్

అమరావతి,అక్టోబర్14,(సామాన్యుడి అస్త్రం)







ప్రముఖ నిర్మాణ సంస్థ నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) వ్యవస్థాపకులు, ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు (ఏవీఎస్ రాజు) కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఏవీఎస్ రాజు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఏవీఎస్ రాజు మరణంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేస్తూ.. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జిల్లా అంతర్వేదిపాలెంలో జన్మించి, ఎన్‌సీసీ సంస్థను స్థాపించి ఉన్నత శిఖరాలకు చేర్చిన దార్శనిక పారిశ్రామికవేత్త అని కొనియాడారు. నిబద్ధత, నిజాయతీతో దేశ నిర్మాణానికి, అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, స్ఫూర్తిమంతమని పేర్కొన్నారు. కేవలం పారిశ్రామికవేత్తగానే కాకుండా ఎన్‌సీసీ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో పేదలకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఏవీఎస్ రాజు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా ఏవీఎస్ రాజు మృతికి సంతాపం తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో ఎన్‌సీసీ సంస్థకు గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకురావడంలో రాజు గారి కృషి ఎనలేనిదని అన్నారు. ఆయన కేవలం పారిశ్రామికవేత్త మాత్రమే కాదని, గొప్ప పద్య రచయితగా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని గుర్తుచేశారు. వివిధ రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించే భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందని లోకేశ్ వివరించారు. దశాబ్దాలుగా ఎన్‌సీసీ సంస్థ ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన మహనీయుడని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.ఏవీఎస్ రాజు కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. నిర్మాణ రంగంలో తనదైన ముద్ర వేస్తూనే, సాహిత్య రంగంలోనూ రాణించారు. మరోవైపు సామాజిక బాధ్యతతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఆయన మరణం పారిశ్రామిక, సేవా రంగాలకు తీరని లోటని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గుండెకు కూడా క్యాన్సర్ వస్తుందా? వైద్య నిపుణులు చెప్పిన నిజాలు!



గుండెకు కూడా క్యాన్సర్ వస్తుందా? చాలా మందిలో ఈ సందేహం ఉంటుంది. అందుకు నిపుణులు సమాధానం ఇచ్చారు. గుండెకు కూడా క్యాన్సర్ వస్తుందని తెలిపారు. కానీ అది అత్యంత అరుదైన క్యాన్సర్లలో ఒకటని వెల్లడించారు. ఎన్డీటీవీ కథనం ప్రకారం... గుండెలో ఏర్పడే కణితులను నిర్లక్ష్యం చేయొద్దని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని కణితులు క్యాన్సర్ కాకపోయినా.. చికిత్స ఆలస్యమైతే ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

గుండెకు క్యాన్సర్ ఎందుకు అరుదు?

క్యాన్సర్ అంటే శరీరంలోని కణాలు అదుపు తప్పి ఇబ్బడిముబ్బడిగా పెరగడం. అయితే గుండె కండరాల కణాలు పెద్దయ్యాక చాలా తక్కువగా విభజన చెందుతాయి. అందుకే గుండెలోనే కొత్తగా క్యాన్సర్ ఏర్పడే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. గుండెలో కనిపించే చాలా కణితులు క్యాన్సర్ కావు. కొన్ని ఇతర అవయవాల నుంచి వ్యాపించి గుండెకు చేరుతాయి.

క్యాన్సర్ కాకపోయినా ప్రమాదమే

గుండెలో ఎక్కువగా కనిపించే కణితిని 'మైక్సోమా' అంటారు. ఇది సాధారణంగా క్యాన్సర్ కాదు. అయినా దాని పరిమాణం, ఉన్న ప్రాంతాన్ని బట్టి రక్తప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది. కొన్నిసార్లు కణితి నుంచి విడిపోయిన చిన్న భాగాలు రక్తంతో కలిసి మెదడు లేదా ఇతర అవయవాలకు చేరి స్ట్రోక్, అవయవాలకు రక్తప్రసరణ ఆగిపోవడం వంటి సమస్యలకు దారితీస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ తప్పడం, గుండె వైఫల్య లక్షణాలు, జ్వరం, తీవ్రమైన అలసట, కారణం లేకుండా బరువు తగ్గడం కూడా కనిపించొచ్చు. ఇలాంటి కణితులను శస్త్రచికిత్సతో పూర్తిగా తొలగించే అవకాశం చాలా సందర్భాల్లో ఉంటుంది.

గుండెలో వచ్చే క్యాన్సర్లు ఏవి?

గుండెలోనే ప్రారంభమయ్యే క్యాన్సర్లు చాలా అరుదు. కానీ అవి వేగంగా వ్యాపించే స్వభావం కలిగి ఉంటాయి. ఇవి గుండె కండరాలు, కవాటాలు, గుండె స్పందనను నియంత్రించే వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా గుండె కొట్టుకునే తీరు మారడం, గుండె వైఫల్యం, రక్తప్రసరణలో ఆటంకం వంటి సమస్యలు ఎదురవుతాయి. మరోవైపు ఊపిరితిత్తులు, రొమ్ము, మూత్రపిండాలు లేదా రక్తానికి సంబంధించిన క్యాన్సర్లు కొన్నిసార్లు గుండెకు కూడా వ్యాపించే అవకాశం ఉంటుంది.

ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

గుండెలో కణితులు ఉన్నా వాటి లక్షణాలు సాధారణ గుండె సమస్యల్లాగే ఉంటాయి. అందుకే గుర్తించడం కష్టమవుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తగ్గని ఛాతీనొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, తరచూ స్పృహ తప్పడం, కాళ్లు వాపు, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఎలా గుర్తిస్తారు? చికిత్స ఏంటి?

గుండె అల్ట్రాసౌండ్, కార్డియాక్ ఎంఆర్ఐ, కార్డియాక్ సీటీ స్కాన్ వంటి పరీక్షలతో కణితి పరిమాణం, స్థానం, స్వభావాన్ని గుర్తిస్తారు. అవసరమైతే కణజాల నమూనాను కూడా పరీక్షిస్తారు. కణితి క్యాన్సర్ కాదంటే శస్త్రచికిత్సతో తొలగిస్తారు. క్యాన్సర్ అయితే సర్జరీతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతుంది. ఇతర అవయవాల నుంచి గుండెకు వ్యాపించిన క్యాన్సర్ అయితే అసలు క్యాన్సర్‌కే చికిత్స అందిస్తారు.గుండె క్యాన్సర్‌ను పూర్తిగా నివారించే ప్రత్యేక మార్గాలు లేవు. అయినా పొగాకు అలవాటుకు దూరంగా ఉండటం, రక్తపోటును నియంత్రణలో ఉంచడం, గుండెకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం ఉంటుంది.

బొజ్జను తేలిగ్గా తీసుకుంటున్నారా? క్యాన్సర్‌కు ఇదే పెద్ద హెచ్చరిక!

పొట్ట చుట్టూ కొవ్వు పెరిగిందా? అది కేవలం అందం సమస్య అనుకుంటే పొరపాటే. శరీరంలో నిశ్శబ్దంగా పెరుగుతున్న ప్రమాదానికి అది సంకేతం కావొచ్చు. కొన్ని రకాల క్యాన్సర్‌లతో కూడా దీనికి సంబంధం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

లోపలి కొవ్వే అసలు ముప్పు

శరీరంలో ఉండే కొవ్వు అంతా ఒకేలా ఉండదు. కాలేయం, క్లోమ గ్రంథి, పేగుల చుట్టూ పేరుకునే కొవ్వును విసెరల్ ఫ్యాట్ అంటారు. ఇది చర్మం కింద ఉండే కొవ్వుతో పోలిస్తే చాలా చురుగ్గా పనిచేస్తుంది. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే పదార్థాలు, హార్మోన్లను విడుదల చేస్తుంది. ఇవి కణాల సాధారణ పనితీరుపై ప్రభావం చూపుతాయి.

క్యాన్సర్‌తో ఎలా సంబంధం?

పొట్ట చుట్టూ పేరుకునే కొవ్వు నేరుగా క్యాన్సర్‌కు కారణం కాదు. కానీ శరీరంలో ఇన్‌ఫ్లమేషన్, హార్మోన్ల అసమతుల్యత, ఇన్సులిన్ నిరోధకత పెరగడానికి దోహదపడుతుంది. ఈ పరిస్థితుల్లో దెబ్బతిన్న కణాలు నాశనం కాకుండా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అదే క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

ఈ క్యాన్సర్ల ముప్పు ఎక్కువ

పరిశోధనల ప్రకారం పొట్ట చుట్టూ అధిక కొవ్వు ఉంటే పెద్దపేగు, కాలేయం, క్లోమ గ్రంథి, కిడ్నీ, అన్నవాహిక, గర్భాశయం, మెనోపాజ్ తర్వాత వచ్చే రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ ముప్పు పెరగవచ్చు. అధిక బరువు కనీసం 13 రకాల క్యాన్సర్లతో సంబంధం ఉందని అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన సంస్థ వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయాన్ని క్యాన్సర్‌కు దారితీసే ప్రధాన కారణాల్లో ఒకటిగా గుర్తించింది.

ఇతర ఆరోగ్య సమస్యలూ వెంటనే

విసెరల్ ఫ్యాట్ ఒక్కటే సమస్యగా ఉండదు.

పామాయిల్ తింటే గుండెకు ప్రమాదమా?

అనేక ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో పామాయిల్ ఇందులో శాచురేటెడ్ ఫ్యాట్స్ అధికం అధిక వినియోగంతో చెడు కొలెస్ట్రాల్ రెడ్ పామాయిల్‌లో యాంటీఆక్సిడెంట్లు నూనెను పదేపదే వేడి చేయడం వల్ల దుష్ప్రభావాలు

ఉదయం టిఫిన్ దగ్గర నుంచి సాయంత్రం తాగే టీతో పాటు తినే బిస్కెట్ల వరకు.. మనకు తెలియకుండానే పామాయిల్ రోజువారీ ఆహారంలో భాగమవుతోంది. ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. దీంతో పామాయిల్ పేరు వినగానే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది 'ఆరోగ్యానికి హానికరమా?' అన్న ప్రశ్నే. అయితే దీనిపై నిపుణుల అభిప్రాయం కాస్త భిన్నంగా ఉంది. ఎంత తీసుకుంటున్నారు? ఏ రూపంలో తీసుకుంటున్నారు? అన్నదే అసలు విషయం.

పామాయిల్ అంటే..

ఆయిల్ పామ్ చెట్టు పండ్ల నుంచి పామాయిల్‌ను తయారు చేస్తారు. ఇందులో పాల్మిటిక్ యాసిడ్, ఒలియిక్ యాసిడ్, లినోలియిక్ యాసిడ్ వంటి కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. విటమిన్-ఈ, కెరోటినాయిడ్లు కూడా ఉంటాయి. అయితే పామాయిల్ ఆరోగ్యంపై చూపే ప్రభావం దాని శుద్ధి విధానం, తీసుకునే మోతాదు, వ్యక్తి ఆహారపు అలవాట్లపై ఆధారపడి ఉంటుంది.

రకాలు కూడా ఉన్నాయి

పామాయిల్‌లో ముడి లేదా రెడ్ పామాయిల్, శుద్ధి చేసిన పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్ ప్రధాన రకాలు. రెడ్ పామాయిల్‌లో కెరోటినాయిడ్లు, విటమిన్-ఈ సమ్మేళనాలు ఎక్కువగా ఉంటాయి. శుద్ధి చేసే సమయంలో వీటిలో కొంత భాగం తగ్గిపోతుంది. పామ్ కెర్నల్ ఆయిల్‌ను పామ్ పండు విత్తనం నుంచి తీస్తారు.

గుండెకు ఎంత ముప్పు?

పామాయిల్‌లో కొలెస్ట్రాల్ ఉండదు. 100 గ్రాముల నూనెలో సుమారు 884 కాలరీలు, 49-50 గ్రాముల శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరగొచ్చు. అయితే పామాయిల్ గుండెకు నేరుగా హానికరమని చెప్పేందుకు ఆధారాలు లేవు.

మంచి కూడా ఉంది

మోతాదులో తీసుకుంటే పామాయిల్ నుంచి కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో ఉండే టోకోట్రియనాల్స్, టోకోఫెరాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడొచ్చు. రెడ్ పామాయిల్‌లోని కెరోటినాయిడ్లు విటమిన్-ఏకు మూలంగా ఉపయోగపడతాయి.

అసలు సమస్య ఎక్కడంటే..

ఒకే నూనెను పదేపదే వేడి చేసి వాడటం మంచిది కాదు. ముఖ్యంగా ప్యాకేజ్డ్, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాలను



ఎక్కువగా తీసుకుంటే పామాయిల్ వినియోగం కూడా పెరుగుతుంది. అధికంగా తీసుకుంటే బరువు పెరగడం వంటి సమస్యలు రావొచ్చు. అందుకే ఆహార లేబుల్స్ చూడటం అలవాటు చేసుకోవాలి.

ఎంత తీసుకోవాలి?

పామాయిల్‌ను పూర్తిగా దూరం పెట్టాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. అయితే మితంగా తీసుకోవడం ముఖ్యం. రోజువారీ మొత్తం కేలరీల్లో శాచురేటెడ్ ఫ్యాట్స్ వాటా 10 శాతానికి మించకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. పామాయిల్‌తో పాటు నట్స్, విత్తనాలు, అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉండే నూనెలను ఆహారంలో సమతుల్యంగా చేర్చుకోవడం మంచిది.పామాయిల్ పేరు చూసి భయపడాల్సిన పనిలేదు. అదే సమయంలో ఎంత పడితే అంత వాడటం కూడా సరైంది కాదు. మోతాదు, నూనె నాణ్యత, వాడే విధానం, మొత్తం ఆహారపు అలవాట్లు.. ఇవే ఆరోగ్యంపై దాని ప్రభావాన్ని నిర్ణయిస్తాయి.

యవ్వనంగా కనిపించాలా?..


వీటిని ఆహారంలో చేర్చుకోండి..!



చర్మంపై ముడతలు తగ్గాలంటే చాలామంది ఖరీదైన రెటినాల్ క్రీమ్‌లు, సీరమ్‌ల వైపు చూస్తారు. కానీ వంటింట్లోనే ఉండే కొన్ని ఆహారాలు కూడా చర్మానికి లోపలి నుంచి బలం ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి క్రీమ్‌లకు ప్రత్యామ్నాయం కాకపోయినా, చర్మ కణాల ఆరోగ్యాన్ని కాపాడుతూ యవ్వనంగా కనిపించేందుకు తోడ్పడతాయి.ఈ జాబితాలో ముందుగా చెప్పుకోవాల్సింది చిలగడదుంప గురించే. ఇందులో బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. శరీరం దీన్ని అవసరమైనప్పుడు విటమిన్-ఏగా మార్చుకుంటుంది. దీంతో చర్మ కణాల పునరుద్ధరణకు తోడ్పడుతుంది. ఉడికించి, కాల్చి లేదా చాట్‌లా తీసుకున్నా మంచి ప్రయోజనం ఉంటుంది. క్యారెట్‌లో కూడా ఇది ఎక్కువగా ఉంటుంది. పైగా ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలుష్యం, ఎండ ప్రభావం నుంచి చర్మాన్ని కాపాడతాయి.పాలకూర, తోటకూర వంటి ఆకుకూరలను కూడా నిర్లక్ష్యం చేయొద్దని నిపుణులు చెబుతున్నారు. వీటిలో బీటా కెరోటిన్‌తో పాటు విటమిన్-సీ, ల్యూటిన్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. అలాగే గుడ్డు పచ్చసొనలో నేరుగా విటమిన్-ఏ లభిస్తుంది. దీనితో పాటు ప్రొటీన్, బయోటిన్, ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉండటంతో చర్మం, జుట్టు, గోళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది.గుమ్మడికాయ కూడా ఈ జాబితాలో కీలకమైన ఆహారమే. ఇందులో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. కూర, సూప్, పులుసు రూపంలో తీసుకోవచ్చు. గుమ్మడికాయ రంగు ఎంత ముదురు నారింజ రంగులో ఉంటే అంత ఎక్కువ పోషకాలు ఉండే అవకాశం ఉంటుంది. క్యారెట్‌ను కొద్దిగా నెయ్యి లేదా వేరుశెనగలతో తింటే బీటా కెరోటిన్‌ను శరీరం మరింత సులభంగా గ్రహిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.అయితే ఈ ఆహారాలు తింటే రెటినాల్ క్రీమ్‌ల అవసరం పూర్తిగా తీరిపోతుందని అనుకోవద్దని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఆహారం చర్మానికి లోపలి నుంచి పోషణ అందిస్తే, రెటినాల్ ఉన్న క్రీమ్‌లు నేరుగా చర్మంపై పనిచేస్తాయి. కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నీరు, మంచి నిద్ర, సరైన చర్మ సంరక్షణ.. ఇవన్నీ కలిస్తేనే చర్మం ఎక్కువకాలం ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపిస్తుంది.

షుగర్ బాధితులకు గుడ్‌న్యూస్..

మధుమేహం చికిత్సలో కీలక ముందడుగు పడింది. ప్రపంచంలోనే వారానికి ఒక్కసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నార్డిస్క్ 'అవిక్లీ (కాఇఅనశ్రీఅ)' పేరుతో ఈ ఇన్సులిన్‌ను విడుదల చేసింది. టైప్-1, టైప్-2 మధుమేహంతో బాధపడే వారికి ఇది ఉపయోగపడనుంది.సాధారణంగా ఇన్సులిన్ తీసుకునే రోగులు రోజూ ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. కొత్తగా వచ్చిన 'అవిక్లీ'తో వారానికి ఒక్కసారి ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. దీంతో ఏడాదికి 365 ఇంజెక్షన్ల స్థానంలో కేవలం 52 వేసుకుంటే చాలు. రోజూ సూది తీసుకోవాలనే భయంతో చాలామంది ఇన్సులిన్‌ను ఆలస్యంగా ప్రారంభిస్తుంటారని, ఈ సమస్యకు కొత్త చికిత్స ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది.భారత్‌లో ప్రస్తుతం దాదాపు 10.1 కోట్ల



మంది మధుమేహంతో బాధపడుతున్నారు. మరో 13.6 కోట్ల మందిలో ప్రీ డయాబెటిస్ లక్షణాలు ఉన్నాయి. అలాగే తొమ్మిది లక్షల మందికిపైగా టైప్-1 మధుమేహ రోగులు ఉన్నారు. టైప్-2 మధుమేహంతో బాధపడేవారిలో కూడా కొంతమందికి ఇన్సులిన్ తప్పనిసరిగా అవసరం అవుతోంది.ఈ ఇన్సులిన్‌ను ఫ్లెక్స్‌టచ్ పెన్ ద్వారా వారానికి ఒక్కసారి తీసుకోవాలి. ఇలా తక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి రావడంతో చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించే అవకాశం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే సామర్థ్యంలో ఇది రోజూ తీసుకునే ఇన్సులిన్‌తో పోలిస్తే మెరుగైన ఫలితాలు ఇచ్చినట్లు క్లినికల్ పరీక్షల్లో తేలిందని కంపెనీ వెల్లడించింది. భద్రత విషయంలో కూడా ఇదే స్థాయి ఫలితాలు నమోదయ్యాయని తెలిపింది.రోజూ ఇంజెక్షన్ల భయం, చికిత్స క్లిష్టంగా ఉండటం వల్ల చాలామంది ఇన్సులిన్‌ను ఆలస్యంగా ప్రారంభిస్తారని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారికి వారానికి ఒక్కసారి తీసుకునే ఈ కొత్త ఇన్సులిన్ మంచి ప్రత్యామ్నాయంగా మారొచ్చని అభిప్రాయపడుతున్నారు. దీంతో మధుమేహ నియంత్రణ మరింత సులభం అయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

సరిగా నిద్ర పోవట్లేదా? గుండెకు ప్రమాదం తప్పదంటున్న నిపుణులు!

మన శరీరానికి నిద్ర కేవలం విశ్రాంతి మాత్రమే కాదు.. గుండె ఆరోగ్యాన్ని కాపాడే కీలక ఆధారం కూడా. రోజూ సరిపడా, నాణ్యమైన నిద్ర లేకపోతే గుండెపై అదనపు భారం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిద్ర సమయంలో శరీరం తనను తాను పునరుద్ధరించుకోవడంతో పాటు హార్మోన్ల సమతుల్యం, రక్తపోటు నియంత్రణ, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడం వంటి కీలక ప్రక్రియలు జరుగుతాయి. ఈ విశ్రాంతి దశ తగ్గిపోతే గుండె జబ్బులు, గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.సాధారణంగా ఆరోగ్యకరమైన నిద్రలో రక్తపోటు 10 నుంచి 20 శాతం వరకు తగ్గి, గుండె స్పందన కూడా నెమ్మదిస్తుంది. అయితే రోజుకు ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోతే ఈ సహజ ప్రక్రియ దెబ్బతింటుంది. దీంతో రక్తపోటు ఎక్కువసేపు అధికంగానే ఉండటం, ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ పెరగడం, ఇన్సులిన్ నిరోధకత, బరువు పెరగడం వంటి మార్పులు చోటుచేసుకుంటాయి.

నానితో ప్రేమకథ!



కన్నడ సొందర్యం రుక్మిణి వసంత్(ప్రస్తుతం టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్గా దూసుకుపోతోంది. పరిశ్రమలోకి అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే తన అద్భుత నటన, అందంతో వరుస విజయాలను అందుకుంటున్న ఈ భామకు.. తాజాగా తెలుగులో మరో బంపర్ ఆఫర్ దక్కినట్టు సోషల్ మీడియాలోజోరుగా ప్రచారం సాగుతోంది. '96', 'మెయ్యళగన్' (సత్యం సుందరం) వంటి ఫీల్ గుడ్ ఎమోషనల్ చిత్రాలతో మెప్పించిన టాలెంటెడ్ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో, నేచురల్ స్టార్ నాని హీరోగా ఒక నూతన చిత్రం తెరకెక్కబోతున్నట్టు సమాచారం.పూర్తిగా మనసుకు హత్తుకునే సున్నితమైన ప్రేమకథగా రూపొందనున్న ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్గా ఎంపికైనట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర ఎంతో శక్తిమంతంగా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యతతో ఉంటుందట. అందుకే ఆ పాత్ర కోసం మేకర్స్ రుక్మిణిని ఖరారు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల టాక్.ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'డ్రాగన్'లో టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటిస్తున్న ఈ క్రేజీ బ్యూటీ ఖాతాలో.. ఇప్పుడు నాని సినిమా కూడా చేరడం విశేషం. ఇలా బ్యాక్ టు బ్యాక్ టాలీవుడ్ స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటున్న రుక్మిణి వసంత్ క్రేజ్ చూస్తుంటే, త్వరలోనే తెలుగు ఇండస్ట్రీని ఈమె ఏలడం ఖాయంగా కనిపిస్తోంది.

బాలీవుడ్ ఇండస్ట్రీలో 'హిందూ ఫోబియా' ఉంది: ఏక్తా కపూర్



ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్ సినీ పరిశ్రమపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలీవుడ్ ఇండస్ట్రీలో 'హిందూ ఫోబియా' (హిందూ వ్యతిరేకత) బలంగా పాతుకుపోయిందని ఆమె ఆరోపించారు. ఇటీవల తన కొత్త చిత్రం 'ది వాన్' ప్రమోషన్లో భాగంగా రణ్వీర్ అలహాబాదియా పాడ్కాస్ట్లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.పాశ్చాత్య ఫాంటసీ, యానిమేషన్ చిత్రాలను పరిశ్రమ తేలికగా అంగీకరిస్తుందని, కానీ భారతీయ జానపద కథలు, పురాణాలు, సంస్కృతి ఆధారంగా సినిమాలు తీస్తే మాత్రం అసౌకర్యంగా ఫీలవుతుందని ఏక్తా కపూర్ అన్నారు. తన కెరీర్ ప్రారంభంలో నుదుట బొట్టు, చేతికి ధాగా (దారం) కట్టుకున్నందుకు తనను చాలామంది వింతగా చూశారని, 'తాంత్రికురాలు', 'ఫ్రీక్' అని పిలిచారని ఆమె గుర్తుచేసుకున్నారు.

అభిమానుల ప్రేమకు రష్మిక బహుమతి..

నటి రష్మిక మందన్న మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. ఆపదలో ఉన్న 400 కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. మూడు నెలల పాటు ఆ కుటుంబాల నిత్యావసర సరుకుల ఖర్చును భరించనున్నట్లు ప్రకటించారు. తనలోని ఈ సేవాభావానికి 'రణబాలి' సినిమాలోని జయమ్మ పాత్రే స్ఫూర్తి అని వెల్లడించారు.ఇప్పటివరకు తాను చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి బయటకు చెప్పలేదని రష్మిక తెలిపారు. అయితే తనను చూసి మరికొందరైనా సాయం చేసేందుకు ముందుకొస్తారనే ఉద్దేశంతో ఈ విషయాన్ని పంచుకున్నట్లు వివరించారు.



దేశం మొత్తం జంతర్ మంతర్గా మారుతుంది



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలపై ఆంక్షలు విధించడం, కాక్రోచ్ జనతా పార్టీ నేతలను అరెస్ట్ చేయడంపై ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా విడుదల చేసిన ఒక వీడియోలో, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నిరసన ప్రదేశాన్ని మార్చగలరేమో కానీ, ప్రజల గొంతును నొక్కలేరని ఆయన హెచ్చరించారు.జాతీయ జెండాతో జంతర్ మంతర్లోకి ప్రవేశించిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను పోలీసులు అరెస్టు చేసి, ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన సంగతి తెలిసిందే. ఈ చర్యను ప్రకాశ్ రాజ్ తీవ్రంగా ఖండించారు. "మీరు నిరసన స్థలాన్ని మార్చగలరు, నిరసనను ఆపగలరు. కానీ ఈ దేశ ప్రజల గొంతును అణచివేయలేరు. దేశం మొత్తం జంతర్ మంతర్గా మారుతుంది"

'ఐస్' (సోనీ లివ్) సిరీస్ రివ్యూ!



మొదటి నుంచి కూడా 'సోనీ లివ్' క్వాలిటీ విషయంలో రాజీలేని భారీ వెబ్ సిరీస్ లను అందిస్తూ వస్తోంది. బలమైన కథాకథనాలకు ప్రాధాన్యతనిస్తూ, విలక్షణమైన కంటెంట్ ను అందిస్తూ వెళుతోంది. అలా 'సోనీ లివ్' మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది .. ఆ సిరీస్ పేరే 'ఐస్'. నిఖిలా విమల్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ థ్రిల్లర్ సిరీస్ ను , 7 ఎపిసోడ్స్ గా రూపొందించారు. మొత్తంగా చూసుకుంటే ఒక్కో ఎపిసోడ్ నిడివి 50 నిమిషాల వరకూ ఉంది. ఈ నెల 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్, తెలుగులోనూ అందుబాటులో ఉంది.ప్రేమ పేరుతో అమ్మాయిలను వలలో వేసుకోవడం .. ఏ మాత్రం తేడా వచ్చినా వాళ్ల ప్రాణాలు తీయడం సర్వ సాధారణమైపోయింది. పెళ్లి తరువాత భర్త వేధింపులను భరిస్తూ వస్తున్న అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. ప్రేమించిన అమ్మాయిని .. తమని నమ్మి పెళ్లి చేసుకున్న అమ్మాయిని హత్య చేయడానికి ఏ మాత్రం వెనుకాడని అబ్బాయిల ధోరణి అందరిలో భయాన్ని కలిగిస్తున్నాయి. ఇలాంటి నేరాలను అరికట్టడానికి .. అబ్బాయిలను కౌన్సిలింగ్ ద్వారా మార్చడానికి 'విద్య' ఒక సాఫ్ట్ వేర్ ను కనిపెడుతుంది. జరగబోయే నేరాలను ముందుగానే పసిగట్టే ఆ సాఫ్ట్ వేర్ పేరే 'ఐస్'. అమ్మాయిలపై అబ్బాయిల దాడులను ముందుగానే పసిగట్టి, వాళ్లలో నేర ప్రవృత్తికి అడ్డుకట్ట వేయడమే ఈ సాఫ్ట్ వేర్ లక్ష్యం. పాజిటివ్ పోలీసింగ్ ద్వారా పోలీస్ డిపార్టుమెంట్ ఈ సాఫ్ట్ వేర్ ను ఉపయోగించడానికి సహకరించవలసినదిగా ఆమె పోలీస్ డిపార్టుమెంట్ ను కోరుతుంది. దాంతో డిపార్టుమెంట్ వారు ఆ వైపు నుంచి ఆమెకి పోలీస్ ఆఫీసర్ 'టీనా'ను .. కానిస్టేబుల్ 'జస్టిన్'ను ఇస్తారు. మానసిక వైద్య నిపుణురాలు అయిన 'అయేషా' (నిఖిలా విమల్) కూడా తన అసిస్టెంట్ 'తన్వీ'తో ఈ టీమ్ లోకి వస్తుంది. ఈ సాఫ్ట్ వేర్ ఎలా పనిచేస్తుందనేది తెలుకోవడం కోసం ట్రైల్స్ మొదలుపెడతారు.

మాతృత్వంపై శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు!



ప్రముఖ నటి శోభితా ధూళిపాళ తన వ్యక్తిగత జీవితం, మాతృత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు ఎప్పటినుంచో ఒక కుటుంబాన్ని ప్రారంభించాలని కోరిక ఉందని, అయితే అలాంటివి జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయని ఆమె అన్నారు. గతేడాది డిసెంబర్లో టాలీవుడ్ నటుడు నాగచైతన్యను వివాహం చేసుకున్న శోభిత, పెళ్లి తర్వాత తొలిసారి ఫ్యామిలీ ప్లానింగ్పై స్పందించారు.ఇటీవల 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు పంచుకున్నారు. "నాకు ఎప్పటినుంచో ఒక కుటుంబం కావాలని ఉంది. కానీ దాని గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడి పెంచుకోను. ఎందుకంటే కొన్ని విషయాలు జరగాల్సిన సమయంలో వాటంతట అవే జరుగుతాయి" అని శోభిత వివరించారు. తన తొలి చిత్రం 'రామన్ రాఘవ్ 2.0' తో పరిశ్రమలోకి అడుగుపెట్టి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు.గతంలో తాను నటులను ఎప్పటికీ డేట్ చేయనని చెప్పిన విషయాన్ని కూడా శోభిత గుర్తుచేసుకున్నారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.